తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

# జనంసాక్షి

Estd : 2002

www.janamsakshi.org

మంగళవారం 14.04.2026 | సంపుటి :12 | సంచిక : 265 | పేజీలు :12 | వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV





## 2011 జనాభా లెక్కల ప్రకారం

# డీలిమిటేషన్ వద్దు

**2026 జనాభా లెక్కల తర్వాతే అమలు చేయాలి**

**డీలిమిటేషన్‌కు,మహిళా బిల్లుకు లింకేంటీ?: సీఎం రేవంత్**

"డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని పార్టీలకు లేఖలు రాస్తాం, డీలిమిటేషన్ అన్యాయంపై అన్ని రాష్ట్రాల సీఎంలకు లేఖలు రాస్తాను. మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడి పెట్టొద్దు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు?. సీట్లు 50 శాతం పెంచాలని మోదికి ఏ దేవుడు చెప్పాడు?. 50 శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం పెంచుతుంది" - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- ఈ రెండింటినీ కలపడంలో బీజేపీ రాజకీయ కుట్ర దాగి ఉంది
- అసెంబ్లీ సీట్లలో మహిళా కోటా వెంటనే అమలు చేయాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు
- పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ
- జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు
- ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు?
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి
- 50% సీట్ల పెంపు ఏ ప్రాతిపదికనో ఎందుకు చెప్పడం లేదు?
- మహిళలంటే బీజేపీకి మొదటి నుంచీ చిన్నచూపే..
- 15మంది పార్టీ అధ్యక్షులు మారినా..మహిళలకు చోటేది?
- ముఖ్య పదవుల్లో కూడా మహిళలకు చోటివ్వలేదు
- కాంగ్రెస్‌లో ఇందిర, సోనియాలు అధ్యక్షులుగా పనిచేశారు
- బండి సంజయ్ విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్(జనంసాక్షి):**మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. 2026 జనాభా లెక్కల ప్రకారంమహిళా రిజర్వేషన్ల బిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. హిళలరాజకీయసాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టు బడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను మిగతా 2లో..

## డీలిమిటేషన్ రాజ్యాంగంపై దాడే

- రాజ్యాంగాన్ని నాశనం చేయడమే భాజపా లక్ష్యం
- కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ

## మహిళా రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌కు అవగాహన లేదు

- పార్లమెంట్ చర్చలో ఎంపీలు ఎవరైనా మాట్లాడవచ్చు : కిషన్ రెడ్డి
- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌తో వచ్చే నష్టమేమీలేదు: బండి

## ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాంల నిర్మాణంపైన దృష్టి సారిస్తాం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో..

## టెట్ నోటిఫికేషన్ విడుదల

**రేపటి నుంచి దరఖాస్తులస్వీకరణ**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైంది. ఏప్రిల్ 15 నుంచి 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డా.ఈ.నవీన్ నికోలస్ వెల్లడించారు. ఏడాదికి రెండు సార్లు (జూన్, డిసెంబర్) టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాదిలో ఇది తొలి విడత మిగతా 2లో..





## పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ ఎందుకుండొద్దు?

**ఈ అంశంపై స్పందించాలని ఈసీ, కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలకు సుప్రీం ఆదేశాలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దొంగఓట్ల కట్టడికి పోలింగ్ కేంద్రాల్లో ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలు అమలు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ అభ్యర్థనపై విచారణ జరిపేందుకు సుప్రీం అంగీకరించింది.కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఇటీవల ఎన్నికలు పూర్తికాగా.. తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న రెండు విడతల్లో ఓటింగ్ జరగనుంది. సుప్రీంకోర్టు వీటి గురించి ప్రస్తావిస్తూ.. ప్రస్తుత ఎన్నికలకు ఈ మిగతా 2లో..

## ఎన్నికల ఒత్తిడితో 'సర్'ను వక్రీకరించొద్దు :సుప్రీం

## ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

**22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ప్రకటించిన ఆర్టీసీ జేఏసీ • సమ్మెపై కార్మికులు ఆలోచించాలి: పొన్నం**



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఈ నెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. మార్చి 13న సమ్మె నోటీసులు ఇచ్చామని.. ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ప్రభుత్వం సమ్మె నివారణ చర్యలు చేపట్టాలని కోరింది. ప్రభుత్వం, యాజమాన్యం ముందు 32 డిమాండ్లు పెట్టినట్లు జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. మిగతా 2లో..

## కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు



**మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై అసత్య ప్రచారాలపై బాధ్యత వహించాలంటూ తాఖీదులు**

**హైదరాబాద్(జనంసాక్షి):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ఆరోపణలకు కేసీఆర్ బాధ్యత వహించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సోమవారం 13న రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీసులు పంపించారు సీతక్క. సీతక్క తరుపు అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు మిగతా 2లో..



# హర్మూజ్ దిగ్భంధనం షురూ

**ట్రంప్ ఆదేశాలతో ఇరాన్ పోర్టులకు వెళ్లి, వచ్చే ఓడలను ఎక్కడికక్కడే అడ్డుకుంటున్న అమెరికా నౌకాదళం**



**టెహ్రాన్(జనంసాక్షి):**

ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ రాజుకున్నాయి. హర్మూజ్ జల సంధిని దిగ్భంధిస్తానని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో.. ఇరాన్ పోర్టుల వైపు వెళ్లి, వచ్చే అన్ని నౌకలను అమెరికా నౌకా దళం అడ్డుకోవడం ప్రారంభించింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 7:30 గంటల నుంచి ఈ దిగ్భంధనం అమల్లోకి వచ్చింది. ఇందుకోసం అమెరికా నౌకాదళం భారీగా బలగాలను మోహరించింది. ఇరాన్ పోర్టుల్లోకి వెళ్లే.. బయటకు వచ్చే అన్ని దేశాల నౌకలను హర్మూజ్ వద్ద అడ్డుకుంటామని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. అదే సమయంలో ఇరానేతర పోర్టులకు వెళ్లి వచ్చే వాటికి అంతగా ఆటంకాలు కలిగించబోమని పేర్కొంది. ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్‌తో జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో అమెరికా అడ్డుకోవడం ప్రారంభించింది. మరోవైపు, మిగతా 2లో..

## యుద్ధం వేళ.. భారత్‌కు ఇరాన్ చమురు

**దాదాపు ఏడేళ్ల తరువాత మన దేశ తీరానికి చేరుకున్న ఆ దేశ నౌకలు**



2లో..

## మాజోలికొస్తే పర్షియన్ గల్ఫ్ రేవులను దిగ్బంధిస్తాం

**హర్మూజ్ కట్టడిపై అమెరికాకు ఇరాన్ హెచ్చరిక**

- మా శక్తి ఏంటో ట్రంప్‌కు తెలుసు..!
- ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫత్‌హాలీ కీలక వ్యాఖ్యలు
- ఐఆర్‌జీసీ దాడిలో దెబ్బతిన్న అమెరికా ట్యాంక్ విమానం
- మా దేశంలోని పౌరనివాసాలనూ అమెరికా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోంది : ఇరాన్



**టెహ్రాన్(జనంసాక్షి):**హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ చేసిన ప్రకటనపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది.అంతర్జాతీయ జలాల్లో నౌకల రాకపోకలపై ఆంక్షలు విధించడం 'సముద్రపు దొంగతనం'తో సమానమని ఐఆర్‌జీసీ పేర్కొంది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే పర్షియన్ గల్ఫ్ ప్రాంత మంతటా సముద్ర భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. అమెరికా తమ రేవులను దిగ్బంధిస్తే.. తాము గల్ఫ్ రేవులను మూసివేస్తామనింది. మిగతా 2లో..

## సరికొత్త చరిత్ర లిఖించడానికి చేరువలో ఉన్నాం

**మహిళా బిల్లు ఈ శతాబ్దంలో ముఖ్యమైన నిర్ణయం: ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

భారత్ సరికొత్త చరిత్ర లిఖించడానికి అతి చేరువలో ఉందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈ 21వ శతాబ్దంలో అతి పెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఉద్దేశించి సోమవారం దిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు."భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారు. మహిళల రిజర్వేషన్ల బిల్లు అత్యావశ్యకం. సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోంది. ప్రతి పార్టీ దీన్ని ముందుకు తీసుకెళ్లాలి. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి. ఈ నిర్ణయం మహిళా శక్తి, గౌరవానికి అంకితం. దేశ పార్లమెంట్ ఒక కొత్త మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి
- అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

9లో..



## ప్రతి సర్వే నెంబర్‌కు 'భూధార్'

**భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి**


- చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి
- ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన
- 70 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్
- 3.80లక్షల మందికి పాస్‌బుక్‌ల జారీ
- పాతసర్వే పద్ధతులకు స్వస్తి,రోవర్లతో సర్వే
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే మిగతా 2లో..




## ఉప్పల్ స్టేడియంలో క్యూఆర్ కోడ్ వ్యవస్థ

- ఇక అభిమానులకు సులభ ప్రవేశం



**ఉప్పల్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** ఐపీఎల్ మ్యాచ్‌లకు హాజరయ్యే క్రికెట్ అభిమానులకు శుభవార్త. హైదరాబాదులోని ఉప్పల్ స్టేడియంలో ఇకపై డిజిటల్ టికెట్లతో క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా సులభంగా స్టేడియంలోకి ప్రవేశించేందుకు కొత్త విధానం అమల్లోకి తీసుకువచ్చారు. ఈ నిర్ణయాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పోలీసులు కలిసి తీసుకున్నారు. ఇప్పటి వరకు మ్యాచ్‌ల సమయంలో టికెట్ వెరిఫికేషన్‌లో ఆలస్యం, భారీ రద్దీ, తోపులాటలు, నకిలీ టికెట్ల సమస్యలు తరచూ ఎదురవుతుండేవి. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ క్యూఆర్ కోడ్ స్కానింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీని ద్వారా అభిమానులు తమ మొబైల్‌లో ఉన్న డిజిటల్ టికెట్‌ను స్కాన్ చేయించుకుని వేగంగా స్టేడియంలోకి ప్రవేశించగలుగుతారు. సోమవారం జరిగిన రాజస్థాన్ రాయల్స్ – సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ నుంచే ఈ విధానం అమలులోకి వచ్చింది. మ్యాచ్ రోజున క్యూఆర్ కోడ్ యాక్టివ్ అవడంతో, స్టేడియం గేట్ల వద్ద ఏర్పాటు చేసిన స్కానర్ల ద్వారా టికెట్లను త్వరితగతిన తనిఖీ చేసి అభిమానులను అనుమతిస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా అభిమానులకు సౌకర్యం పెరగడంతో పాటు భద్రతా చర్యలు కూడా మరింత కట్టుదిట్టం అవుతున్నాయని అధికారులు తెలిపారు. ఇకపై ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ అనుభవం మరింత సులభంగా, వేగంగా, సురక్షితంగా ఉండనుంది.

## ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో యువకుడు సూసైడ్



**ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** ఇంటర్మీడియేట్‌లో ఫెయిల్ కావడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సత్తనపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. భూక్యా ఆకాష్(18) ఇంటర్మీడియట్ ఖానాపూర్ ఏ ఆర్ ఎస్ కళాశాలలో చదువుకునేవాడు ప్రస్తుతం సెలవులు ఉన్న కారణంగా వారం రోజులుగా హైదరాబాద్ లో కంప్యూటర్ శిక్షణకై వెళ్ళి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. కాలి సమయం ఉండటంతో డీజే ఆపరేటర్‌గా వెళ్లేవాడని తండ్రి రాజేశ్వర్ తెలిపారు. ఈ క్రమంలో రాత్రి ఇంటి కి చేరుకున్న ఆకాష్ భోజనం చేసి పడుకున్నాడనీ, మరునాడు ఉదయం కుటుంబీకులు తలుపు తట్టగా తీయకపోగా గదికి అనుకోని ఉన్న కిటికీ నుండి చూడగా డ్రిల్‌కి టవల్‌తో ఉరివేసుకుని విగత జీవిగా కనిపించాడు. ఇంటర్మీడియేట్ ఫలితాల్లో ఆకాష్ ఫెయిల్ కావడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని తండ్రి రాజేశ్వర్ ఇచిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

## ఈతకు వెళ్లి బావిలో మునిగి యువకుడి దుర్మరణం



**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వరంగల్ నగరంలోని ఉరుసు ప్రాంతానికి చెందిన ఆకులపల్లి మనీష్ (18) అలియాస్ సన్నీ తన స్నేహితులైన అజయ్, రామ్ చరణ్, పూర్ణచందర్లతో కలిసి ఉరుసు బైపాస్ రోడ్ లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న భావి వద్దకు వెళ్లి మధ్యాహ్నం మూడున్నర గంటలకు ఈత కోసం బావిలోకి దిగారు. అయితే ఆకులపల్లి మనీష్ కు ఈతరాదని తెలిసి కూడా బావిలోకి దిగినట్లు తనతో వచ్చిన ముగ్గురు స్నేహితులు తెలిపారు. తాము కూడా ఈత కొడుతూ బయటికి వచ్చామని అయితే నీళ్లలో ఉన్నటువంటి మనీష్ మాత్రం నీటిలో మునిగి తమకు కనిపించకుండా పోయాడని తెలిపారు. ఈ క్రమంలో తాము అతనినీ కాపాడేందుకు ప్రయత్నం చేశామని బయటకు వచ్చి సమీపంలో ఉన్న వళ్లను పిలిచామని అప్పటికే మనీష్ నీళ్లలో మునిగి అడుగుభాగానికి పోయినట్టు తాము గుర్తించినట్లు మనీష్ స్నేహితులు తెలిపారు. ఈ క్రమంలో సంఘటనపై పోలీసులకు సమాచారం అందడంతో వారితోపాటు ఫైర్ సిబ్బంది కూడా సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని వెలికి తీసే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం.

## ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందనలు



**భీమదేవరపల్లి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ఉన్న స్వామి రామానంద తీర్థ సహకార జూనియర్ కళాశాల విద్యార్థినీలు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థినీలు అత్యుత్తమ మార్కులు సాధించి హుస్నాబాద్ డివిజన్‌లో టాపర్స్‌గా నిలిచారు. సీఈసీ విభాగంలో ఒక విద్యార్థిని 972/1000 మార్కులు సాధించి ప్రతిభ చాటగా ఎంపిహెచ్‌డబ్ల్యూ విభాగంలో సల్లూరి రవళి 915/1000 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ ఫలితాలు కళాశాలకు గౌరవాన్ని తీసుకువచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం విద్యార్థినీలను ప్రత్యేకంగా అభినందించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కృషి పట్టుదలతో ముందుకు సాగితే మరిన్ని విజయాలు సాధించవచ్చని మంత్రి సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కూడా విద్యార్థినీలను అభినందిస్తూ, వారి విజయానికి కారణమైన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం

### సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది



**హైదరాబాద్, ఏప్రిల్13 (జనంసాక్షి) :** నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

# మహానగరంలో బస్సు షెల్టర్లు అధ్వానం

### యుద్ధ ప్రాతిపదికన ఆధునీకరించాలి

- ఆప్ నేతలు హేమ జిల్లోజు, బుర్ర రాము గౌడ్
- శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రయాణికులకు శాపం
- బస్సు షెల్టర్ల దుస్థితి పై టీజీఎస్ ఆర్టీసీ ఎండీ కి 'ఆప్' నేతల విన్నపం



**ముషీరాబాద్, ఏప్రిల్ 13 (జనం సాక్షి):** హైదరాబాద్ నగర వ్యాప్తంగా బస్సు షెల్టర్ల దుస్థితి అధ్వానంగా తయారైందని, వాటిని ఆధునీకరించాలని, బస్ షెల్టర్లు, పరిసర ప్రాంతాలు ఉన్న తీరు ను వివరిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేతలు టిజిఎస్ ఆర్టిసి ఎండి నాగిరెడ్డి ని సోమవారం బస్సు భవన్లో కలిసి ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమ జిల్లోజు, వర్కింగ్ కన్వీనర్ బుర్ర రాము గౌడ్ లు మాట్లాడుతూ...

గాంధీ ఆసుపత్రి వంటి అత్యవసర ప్రాంతాల్లో కూడా బస్సు షెల్టర్లు లేవనీ, రోగులు, వృద్ధులు ఎండలో అవస్థలు పడుతున్నారనీ, యుద్ధ ప్రాతిపదికన అక్కడ షెల్టర్ ఏర్పాటు చేయాలిని కోరారు. ప్రతి షెల్టర్ వద్ద రూట్ మ్యాప్ బోర్డులు, సమాచార బోర్డులు లేకపోవడం వల్ల ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. షెల్టర్ల వెనుక మలమూత్ర విసర్జన నిలిపివేసి, బ్లీచింగ్ చల్లి శుభ్రపరచాలి" అని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర ప్రయాణికుల కష్టాలను తీర్చడమే లక్ష్యం అన్నారు.

ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి నేతలతో మాట్లాడుతూ.. బస్సు షెల్టర్ల నిర్వహణ, పరిశుభ్రత అంశాలు ప్రధానంగా జిహెచ్ఎంసి (జిహెచ్ఎంసి) పరిధిలోకి వస్తాయని తెలిపారన్నారు. దీనిపై ఇప్పటికే పలుమార్లు జిహెచ్ఎంసి అధికారులకు లేఖలు రాశామని, మరోసారి రాస్తామని చెప్పారన్నారు. షెల్టర్లపై ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయాన్ని జిహెచ్ఎంసి తీసుకుంటుందని, వాటి పర్యవేక్షణ ఆయా అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు చూడాలని ఆయన వివరించారు. దీనిపై స్పందిస్తూ 'ఆప్' నేతలు, ఆర్టీసీ, జిహెచ్ఎంసి, అడ్వర్టైజింగ్ ఏజెన్సీల మధ్య ఉన్న సమన్వయ లోపం వల్ల సామాన్య ప్రయాణికులు ఇబ్బంది పడటం అన్యాయమని మండిపడ్డారు. ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టేయకుండా ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఏప్రిల్ 20 న భారీ నిరసన

అధికారులు త్వరితగతిన స్పందించి క్షేత్రస్థాయిలో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న (సోమవారం) ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు నేతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ ట్రెజరర్ జావిద్ షరీఫ్, సీనియర్ నాయకులు దర్శనం రమేష్, కొడంగల్ శ్రీనివాస్, రాకేష్ రెడ్డి, అజీమ్ మౌలాలి, ఇస్మాయిల్, అడ్వకేట్ ఆదాం, జై సింగ్ జాదవ్, ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో గెలుపు రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సంకేతం

### మహిళ రిజర్వేషన్‌పై పెదవి విప్పని కాంగ్రెస్

- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు




**ఖానాపూర్ ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** మునిసిపాలిటీ చైర్ పర్సన్ పదవిని బిజెపి దక్కించుకోవడం తెలంగాణ రాష్ట్రశీలో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని సంకేతం తెలిపినట్లు అయిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ మున్సిపల్ చైర్ పర్సన్ పదవి కైవసం చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ పొలిమేరలోని కొమరం భీమ్ చౌరస్తా నుండి భారీ ర్యాలీగా వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, శాసనసభాపక్ష నేత నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, ఎంపీ నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ లను పార్టీ శ్రేణులు గజమాలతో ఘనంగా స్వాగతించారు. మునిసిపల్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంకం మౌనిక మహేందర్ చైర్ పర్సన్ గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని అరాచకాలు సృష్టించినా, ఎన్ని అడ్డంకులు తల పెట్టినా భారతీయ జనతా పార్టీని ఆపలేరు అన్న విషయశీ ఖానా పూర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పదవి దక్కించుకోవడంతో తేట తెల్లమైందని అన్నారు. బిజెపి పార్టీ అన్ని వర్గాలను సమానంగా భావిస్తుంది అనడానికి ఇక్కడ వైస్ చైర్మన్ పదవి ఒక ఉదాహరణ అని అన్నారు. అలాగని రానున్న ఎన్నికలలో ఏ పార్టీతో ఎలాంటి పొత్తులు ఉండబోవని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. బూర్జువా పద్ధతిని అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలను పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట కూడా ఎత్తలేని దౌర్భాగ్యం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. 33 శాతం రిజర్వేషన్ మహిళలకు వర్తింపజేయాలనే ఒకే ఒక లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ మోడీ నేతృత్వంలో ఈ నెల 16వ తేదీన లోక్ సభలో మహిళా బిల్లు ప్రవేశపెట్టి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ వర్తింపజేయనున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అధికార ప్రభుత్వ పాలకులు ఎన్ని ప్రలోభాలు పలికినా వెనకడుగు వేయని స్థానిక కౌన్సిలర్ల తీరును ఆయన అభినందించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన అంకశీ మౌనిక మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో స్థానిక బిజెపి పార్టీ ప్రజా ప్రతినిధులు, సహచర కౌన్సిల్ సభ్యుల సహకారంతో మునిసిపల్ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, మాజీ శాసన సభ్యురాలు సుమన్ రాథోడ్ లతోపాటు పార్టీ శ్రేణులు, స్థానిక బిజెపి కౌన్సిల్ సభ్యులు గుమ్ముల ఆనంద్ కుమార్, బొప్పారావు సత్యవతి, బండి పెల్లి సింధుజ ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రగతి' విద్యార్థులకు ఇన్‌స్పైర్ ఐఐటీ, నీట్ రాష్ట్రస్థాయి ఎక్సలెన్స్ అవార్డ్స్

**పాలకుర్తి, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** ఇన్‌స్పైర్ ఐఐటి నీట్ ఫౌండేషన్ ఎక్సలెన్స్ 2026 ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఐఐటీ పరీక్షలో ఉత్తీర్ణులై స్టేట్ టాపర్లుగా ఎంపికైన విద్యార్థులకు. హన్మకొండలోని కాళోజీ క్షేత్రంలో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య. తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా ప్రగతి విద్యా నిలయం విద్యార్థులకు ప్రశంస పత్రాలు షీల్డ్‌లు పాఠశాలల నిర్వాహకుల సమక్షంలో ఇన్‌స్పైర్ ఐఐటి నీట్ ఫౌండేషన్ నిర్వహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి విద్యాలయం ప్రిన్సిపాల్ వీరమనేని వెంకటేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు జీడి. అజయ్, గడ్డం. శ్రీనివాస్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయాన్ని సందర్శించిన టీజీఎఫ్‌డీసీ జీఎం



**వెంకటాపూర్ (రామప్ప), ఏప్రిల్13 (జనంసాక్షి):** వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి సంస్థ(టీజి ఎఫ్డిసి) జనరల్ మేనేజర్ జి స్కైలాబ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు హరీష్ శర్మ,ఉమా శంకర్ లు వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర శిల్పకళ విశిష్టతను టూరిజం గైడ్ గోరంట్ల విజయకుమార్ వారికి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ వారి బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ములుగు జిల్లా ఇన్చార్జి డివిజనల్ మేనేజర్ శైలజ, భూపాలపల్లి జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ బి కరుణాకర్ రావు, వాచర్ శంకర్,టూరిస్ట్ పోలీస్ శ్రీనివాస్, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

## అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి


- కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- ఏప్రిల్ 13న ఇందిరా పార్క్ వద్ద జరిగిన ధర్నాలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ల పిలుపు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అమెరికా-భారత్ వాణిజ్యం ఒప్పందాలు రద్దయ్యే వరకు పోరాడుదామని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, పశ్య పద్మ, బి రాము, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, ఎర్రెడ్డి హంసారెడ్డి, నాగిరెడ్డి , వెంకటేశ్వర్లు,అలకుంట్ల సాయన్న పిలుపు ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన అహామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 13న ఇందిరాపార్క్ దగ్గరిగిన ధర్నాకు పోతినేని సుదర్శన్ రావు, సూర్య నారాయణ,దేవరామ్, కోటేశ్వరరావు,ఇంద్రసేన, తుకారాం నాయక్,సనప పొమ్మయ్య,వి సదానందంల అధ్యక్షతన జరిగిన ధర్నా లో వారు మాట్లాడుతూ...దేశం లో వరి, గోధుమ, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, చెరుకు వంటి పంటలతో పాటు పాడి, పశుసంవర్ధక రంగాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని, రైతు అభివృద్ధి అంటే గ్రామీణ స్థిరత్వం, ఆహార భద్రత, సామాజిక సమానత్వానికి పునాది అని, అయితే రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు కాలేదని స్పష్టంగా కనిపిస్తోందని, ప్రస్తుతం నూతన వ్యవసాయ మార్కెట్ విధానాలు, విత్తన , విద్యుత్ బిల్లుల ద్వారా రైతులను మరింత కష్టాల్లోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని, ఈ విధానాలు రైతులను మార్కెట్ కరుణపై వదిలేస్తూ కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యాన్ని పెంచుతాయి. రైతు స్వావలం బనను దెబ్బతీస్తాయని, ఈ పరిస్థితుల్లో ఫిబ్రవరి 10, 2026న కేంద్ర ప్రభుత్వం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడం రైతాంగానికి తీవ్రమైన ముప్పు, ఈ ఒప్పందం ప్రకారం అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారతదేశంలో సుంకాలు పూర్తిగా తొలగించబడ్డాయని, ఇకపై "సున్నా" సుంకం అమలు అవుతుందని, అదే సమయంలో భారత ఉత్పత్తులకు అమెరికాలో సుమారు 18% సుంకం కొనసాగుతోందని, అంటే ఇది పూర్తిగా అసమాన ఒప్పందమని పేర్కొన్నారు. అమెరికాలో హెక్టారుకు మొక్కజొన్న ఉత్పత్తి 11 టన్నులు ఉండగా, భారత్‌లో అది కేవలం 3.5 టన్నులు. సోయాబీన్ అమెరికాలో 3.4 టన్నులు కాగా, భారత్‌లో 0.9 టన్నులు మాత్రమే. ఆపిల్ ఉత్పత్తి అమెరికాలో 60 టన్నులు ఉంటే, భారత్‌లో 10 టన్నులు మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లో భారత రైతులు అమెరికా రైతులతో పోటీ పడటం అసాధ్యమని, ఈ ఒప్పందం దేశ ఆహార భద్రతకు కూడా ప్రమాదకరం. ప్రభుత్వం అందించే సబ్సిడీలు, బోనస్లు తగ్గించే ఒత్తిడి పెరుగుతుందని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో పంట బోనస్లపై ఆంక్షలు విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది రైతులే కాకుండా దేశ ప్రజలందరికీ నష్టకరమని, ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా రైతాంగ హక్కుల రక్షణ కోసం, రైతుల జీవనాధారాన్ని కాపాడుకోవడం కోసం, ఈ ఒప్పందాన్ని రద్దు చేయడం అత్యవసరమని, రైతు బతికితేనే దేశం బతుకుతుందని అన్నారు.

## ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, ఏప్రిల్13 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం'మూడో దశలో జిల్లాలోని అర్హులైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతకు తమ నైపుణ్యాలు పెంపుదల చేసుకునేందుకు ఇది ఒక గొప్ప అవకాశం అని తెలిపారు. ఇంటర్న్‌షిప్ 6 నుండి12 నెలల వరకు ఉంటుందని తెలిపారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు నెలకు 5 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం (స్టైఫండ్)ఒకసారి అదనంగా ఇచ్చే ప్రోత్సాహకం (గ్రాంట్) 6 వేల రూపాయలు అందుతాయని తెలిపారు. దీంతోపాటు అభ్యర్థులకు పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన,పీఎం సురక్ష బీమా యోజన వంటి పథకాల కింద ఉచిత బీమా సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. 18 నుండి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల విద్యార్హత,10వ తరగతి,ఇంటర్మీడియట్,ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లొమా,డిగ్రీ, బి.టెక్,పిజి చదివిన,చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం 12 లక్షలకు మించరాదని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ మొబైల్ నంబర్,ఆధార్,ఇతర విద్యార్హత పాత్రలు, ఫోటోలతో ప్రధానమంత్రి ఇంటర్న్షిప్ పథకం పోర్టల్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు గరిష్టంగా మూడు ఇంటర్న్‌షిప్ ఆప్షన్లను ఎంచుకునే అవకాశం ఉందని తెలిపారు. మరింత సమాచారం కోసం కలెక్టరేట్ లోని జిల్లా పరిశ్రమల కార్యాలయం,లేదా టోల్-ఫ్రీ నంబర్ 1800116090 ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
14 ఏప్రిల్ 2026

# న్యూజిలాండ్‌లో భారత్ వ్యతిరేక ప్రదర్శనలు

***న్యూజిలాండ్ వంటి అభివృద్ధి చెందిన దేశాలలో భారతీయులపై స్థానిక ప్రజలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారనే వార్తలు ఇటీవల అంతర్జాతీయ వేదికల్లో చర్చనీయాంశమవుతున్నాయి. “ఇది న్యూజిలాండ్ - భారత్ కాదు”, “మా సంస్కృతిని కాపాడండి” వంటి నినాదాలు అక్కడి ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని సూచిస్తున్నాయి. ఈ పరిణామం ఒక తాత్కాలిక భావోద్వేగ స్పందన మాత్రమేనా, లేక దీని వెనుక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక విభేదాల లోతైన సమస్యలున్నాయా అనే ప్రశ్నను మనం గంభీరంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.***

మొదటగా, ప్రపంచవ్యాప్తంగా వలసల పెరుగుదల ఒక సహజ పరిణామం. ముఖ్యంగా భారతదేశం నుండి విద్య, ఉపాధి, వ్యాపారం కోసం విదేశాలకు వెళ్లే వారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. అంచనాల ప్రకారం న్యూజిలాండ్‌లో నివసిస్తున్న భారతీయుల సంఖ్య గత పదేళ్లలో మూడు రెట్లు పెరిగి, సుమారు 2.5 లక్షల మందికి చేరింది. ఈ పెరుగుదల స్థానిక జనాభా నిర్మాణంలో మార్పులను తెచ్చింది. దీనివల్ల ఉద్యోగ అవకాశాలు, నివాస సమస్యలు, స్థానిక వనరుల వినియోగంపై పోటీ పెరిగింది. అయితే ఈ సమస్యను కేవలం స్థానికుల అసహనంగా మాత్రమే చూడటం సరైంది కాదు. వాస్తవానికి, వలసదారులు కూడా తమ ప్రవర్తన, సంస్కృతి, జీవనశైలిలో అనుకూల మార్పులు తీసుకురావడం అత్యంత అవసరం. ఒక దేశంలో నివసించడం అంటే ఆ దేశ చట్టాలు పాటించడం మాత్రమే కాదు; అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక విలువలను గౌరవించడం కూడా అంతే ముఖ్యం. ఈ విషయంలో కొంతమంది భారతీయులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు గతంలో కెనడా, ఆస్ట్రేలియా, యుకే వంటి దేశాల్లో కూడా వినిపించాయి.




> **మన ప్రవర్తన, మన మాట, మన సంస్కారం...ఇవన్నీ కలిసి “భారతీయుడు” అనే గుర్తింపును నిర్మిస్తాయి. కాబట్టి, గౌరవం పొందాలంటే ముందుగా గౌరవించడం నేర్చుకోవాలి.**

ఇది మనకు ఒక గుణపాఠం కావాలి. విదేశాలకు వెళ్లే యువతకు మన విద్యా వ్యవస్థలోనే “సాంస్కృతిక అనుకూలత” (కల్చరల్ అడాప్టేషన్) పై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వం కలిసి ఈ బాధ్యతను తీసుకోవాలి. విదేశాలకు వెళ్లే ముందు ఆ దేశ చట్టాలు, సామాజిక నియమాలు, ప్రవర్తనా ప్రమాణాలు ఏమిటో స్పష్టంగా తెలియజేయాలి. ఉదాహరణకు, ప్రజాస్వామ్య దేశాల్లో వ్యక్తిగత స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, అంతే సమానంగా సామాజిక బాధ్యత కూడా ఉంటుంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం... మనం అక్కడ జనాభా రీత్యా మైనార్టీలమనే స్పృహ కలిగి ఉండాలి. ఇది మన ప్రవర్తనలో వినయం, గౌరవం తీసుకురావాలి. కొన్ని సందర్భాల్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వీడియోలు చూస్తే, కొందరు భారతీయులు స్థానిక నియమాలను పట్టించుకోకుండా ప్రవర్తించడం కనిపిస్తుంది. ఇది వ్యక్తిగత తప్పిదం మాత్రమే కాదు. అది మొత్తం భారతీయ సమాజంపై ప్రతికూల ముద్ర వేస్తుంది. ఒకరి తప్పు వందమందిపై ప్రభావం చూపుతుంది.

ఇక్కడ మనం విమర్శనాత్మకంగా కూడా ఆలోచించాలి. స్థానిక ప్రజల నిరసనల్లో కొంతమేర జాతీయతా భావం, వలస వ్యతిరేక రాజకీయాల ప్రభావం కూడా ఉండవచ్చు. ప్రపంచవ్యాప్తంగా “నేటివిజం” అనే భావజాలం పెరుగుతోంది. ఉద్యోగాలు, సంస్కృతి, భాష పరిరక్షణ పేరుతో వలసదారులపై వ్యతిరేకత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో భారతీయులు మాత్రమే కాకుండా ఇతర వలస సమూహాలు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అయితే ఈ వాస్తవం మన బాధ్యతను తగ్గించదు. మనం ఎక్కడ ఉన్నా “సంస్కృతి” అనేది కేవలం దుస్తులు, భాష కాదు. అది మన ప్రవర్తనలో ప్రతిబింబించాలి. శుభ్రత, సమయపాలన, సామాజిక క్రమశిక్షణ, ఇతరుల గౌరవించటం... ఇవే అసలు సంస్కృతి. ఈ విలువలను పాటిస్తే, మనం ఎక్కడ ఉన్నా గౌరవం పొందగలం.

భారత ప్రభుత్వం కూడా ఈ విషయంలో మరింత చురుకైన పాత్ర పోషించాలి. విదేశాల్లో భారతీయుల రక్షణకు కేవలం దౌత్య సంబంధాలు సరిపోవు. అవగాహన కార్యక్రమాలు, ప్రవర్తనా మార్గదర్శకాలు, అవసరమైనప్పుడు కౌన్సెలింగ్ వంటి చర్యలు అవసరం. అదే సమయంలో విదేశాల్లో భారతీయులపై అన్యాయం జరిగితే దానిపై గట్టిగా స్పందించాలి. మొత్తానికి, న్యూజిలాండ్‌లో జరుగుతున్న ఈ నిరసనలు ఒక హెచ్చరిక. ఇది కేవలం ఒక దేశానికి పరిమితమైన సమస్య కాదు; ప్రపంచవ్యాప్తంగా భారతీయ వలసదారుల ప్రతిష్టకు సంబంధించిన అంశం. మనం ఈ పరిస్థితిని బాధగా కాకుండా, ఒక అవకాశంగా చూడాలి. మన ప్రవర్తనను సరిదిద్దుకోవడానికి, మన విలువలను పునఃపరిశీలించడానికి. విదేశాలకు వెళ్లడం ఒక అవకాశమే కాని, అది బాధ్యత కూడా. మనం అక్కడ మన వ్యక్తిగత విజయాలకే కాకుండా, భారతదేశ ప్రతిష్టకు ప్రతినిధులం. మన ప్రవర్తన, మన మాట, మన సంస్కారం...ఇవన్నీ కలిసి “భారతీయుడు” అనే గుర్తింపును నిర్మిస్తాయి. కాబట్టి, గౌరవం పొందాలంటే ముందుగా గౌరవించడం నేర్చుకోవాలి. అనుకూలంగా మారడం బలహీనత కాదు. అది పరిపక్వత. విదేశాల్లో మన ఉనికి సురక్షితంగా, గౌరవప్రదంగా ఉండాలంటే, అక్కడి చట్టాల పట్ల విధేయత, సంస్కృతిపట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత అనే మూడు సూత్రాలను పాటించడం తప్పనిసరి. ఇదే నిజమైన గుణపాఠం.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

# దూరదృష్టి గల సంస్కర్త అంబేద్కర్




విద్య లేక పోతే వివేకం లేదు, వివేకం లేక పోతే నీతి లేదు, నీతి లేక పోతే దేశ పురోగతి లేదు అన్న భారతదేశపు గొప్ప దార్శనికులలో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 136వ జయంతి ఈ రోజు. ఆయన వారసత్వాన్ని తక్కువ చేసి చూపించడానికి ఒక వర్గం ఉద్దేశపూర్వకంగా అవాంఛనీయ ప్రయత్నాలెన్నో చేసింది. అంబేద్కర్ అందరివాడు అనే సోయి లేకుండా శతాబ్దం గడచిన తర్వాత కూడా, అంబేద్కర్ అంటే కేవలం ఒక దళిత నాయకుడిగా పరిగణించడం జరుగుతుంది. ఆయనను దళితులు, అణ గారిన వర్గాల ప్రతినిధిగా మాత్రమే కాకుండా, ఎవరు అవునన్న కాదన్న ఆధునిక భారత దేశపు అగ్రశ్రేణి మేధావుల్లో ఒకరుగా నిలిచారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఎన్నో అవమానాలకు గురైనారు. ఒకసారి మండు వేసవిలో దాహం తట్టుకోలేక దగ్గర్లో ఉన్న నీళ్ల కుండిలోని నీళ్లు తాగడానికి ప్రయత్నిస్తే... కట్టుబాట్లు ఉల్లంఘించారనే కారణంతో ఆయన మీద వివక్షకు తెగబడ్డారు. ఇటువంటి సంఘటన ఎవరికీ జరిగిన ఇతరులైతే తమ రాత ఇంతే అని సరిపెట్టుకుని ఉండేవారు. మరి కొందరైతే కక్షతో రగిలి హింసా మార్గాన్ని ఎంచుకుని ఉండేవారు. కానీ, ఆయన అలా చేయలేదు.తనలోని బాధను గుండెల్లోనే నింపుకొని సమాజాన్ని చదవడం నేర్చుకున్నారు. ఏ పాఠశాలల్లో అయితే తనను చదువుకోవడానికి అనుమతించలేదో... అంతకు మించిన స్థాయిలో విదేశాల్లో విద్యను పూర్తి చేసి తానేమిటో నిరూపించుకున్నారు . అయినా తన మాతృభూమి, కర్మభూమి అయిన భారతదేశానికి తిరిగి వచ్చే విషయంలో స్పష్టమైన ఆలోచనతో ఉండేవారు. దేశ భవిష్యత్ తోడ్పాటు గల వ్యవస్థల నిర్మాణంలో అంబేద్కర్ పాత్ర విస్మరించలేనిది.

అంబేద్కర్ రాజ్యాంగ రచనా కమిటీకి చైర్మన్ గా మాత్రమే గాక, దృఢమైన ప్రజాస్వామ్యవాది. కష్టపడి సంపాదించిన స్వాతంత్ర్యం గురించే ఆయన ఎక్కువగా ఆలోచించేవారు. రాజ్యాంగ సభలో ఆయన చివరి ప్రసంగంలో ఈ భయాందోళనలు సుస్పష్టంగా వ్యక్తమయ్యాయి. రాజ్యాంగంలో ప్రజాస్వామిక ఆత్మను ఆయన చాలా జాగ్రత్తగా అమర్చారు.ఆయన హెచ్చరికలే భారతదేశాన్ని దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ప్రజాస్వామ్య మార్గంలో నడిపిస్తున్నాయి. మనువాదులకు ప్రజాస్వామ్యం అంటే పడదు ..అంబేద్కర్ కు మనుస్మృతి అంటే పడదు. అయితే నేడు కులం, మతం, జాతి, భాష మొదలైన సామాజిక విభేదాలతో భారతీ యుల మధ్య సోదరభావాన్ని తగ్గించే ప్రయత్నాలను చూస్తున్నాం. పైగా యజుర్వేద, అధర్వణ వేదాల్లోని రుషులు శూద్రులకు తగిన ప్రాధాన్యమిచ్చిన అనేక సందర్భాలను ఉదాహరించారు. తమ సంకుచిత, మతపరమైన ప్రయోజనాల కోసం భాషా సమస్యలను సాకుగా చూపించేవారు దేశ ఐక్యత విషయంలో అంబేద్కర్ అభిప్రాయాలను తెలుసుకుంటే ఎంతో ప్రయోజనందుతారు.తాను ప్రావీణ్యం సంపాదించిన తొమ్మిది భాషలలో ఒకటైన సంస్కృతాన్ని అధికారిక భాషగా ఆమోదించడానికి మద్దతుగా 1949 సెప్టెంబరు 10న ఆయన రాజ్యాంగ సభలో ఒక సవరణను ప్రవేశ పెట్టారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలపై తన ఆలోచనలు వెల్లడిస్తూ... “హిందీని తమ భాషగా స్వీకరించడం భారతీయులందరి విధి’ అని ప్రకటించారు.హిందీ మాట్లాడే ప్రాంతానికి చెందిన వ్యక్తి కాక పోయినప్పటికీ, దేశ ప్రాధాన్యాలకు ప్రథమ స్థానమిచ్చా రన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. దేశంలో ప్రజాస్వామిక పాలన విఫలం అయితే ప్రజలు సాయుధులై తిరుగపడతారని రాజ్యాంగ సభలోనే చాల స్పష్టంగా చెప్పాడు.మనుస్మృతిని పునరుద్ధరించాలనుకునే వారు ఉద్దేశ్యపూర్వకంగానే ప్రణాళికాబద్ధంగానే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే అవకాశం ఉంది.

మూడేళ్లు కష్టపడి ఒక గొప్ప ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించినా రాజకీయ రంగంలో సమానత్వాన్ని సాధించినంత మాత్రాన సరిపోదనిగ్రహించి ‘ప్రజాస్వామ్యం విజయవంతంగా సాగడానికి అనుసరించాల్సిన పద్ధతులపై 1952 డిసెంబర్ 22న ఒక ప్రసంగమిస్తూ...ప్రజా స్వామ్యం రూపం, ఉద్దేశం కాలక్రమేణా మారుతాయనీ, ప్రజలకు సంక్షేమాన్ని అందించడమే ఆధునిక ప్రజాస్వామ్యపు లక్ష్యమనీ పేర్కొన్నారు. ఈ దార్శనికతతోనే అన్ని ప్రభుత్వాలు పేదరికం నుంచి బయటకు తీసుకురావడంలో విజయం సాధించాక పోయినా నటించే ప్రయత్నం అడుగడుగునా కన్పిస్తుంది. ఆయన్ని ఏదో ఒక ప్రాంతానికి పరిమితమైన నాయకుడిగా చేసే ప్రయత్నాలను అడ్డుకోవాలి.’వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించాలంటే బాబా సాహెబ్ ఊహించిన భారతదేశాన్ని సాకారం చేయడానికి మరింత కష్టించి పనిచేయాలన్న ప్రభుత్వాల నిబద్ధతను పునరుద్ఘాటించారు.

అయితే ఏడాదికి ఒక్కసారి అంబేద్కర్ ఆదర్శాలకు అనుగుణంగా నడుచుకుంటామంటూ ప్రతిజ్ఞ చేసే అవకాశాన్ని ఆయన జయంతి కల్పిస్తోంది. జాతి, మత, ప్రాంత, కులాలకు అతీతంగా మనమంతా ‘భారతీయులు’గా సాగిపోదాం.అంటూ కడుపులో కత్తులు పెట్టుకొని శపథం చేసే రాజకీయాలు చూస్తున్నాం. ఒక సందర్భంలో సైమన్ కమిషన్ ఆధారాల గురించి అడిగితే... ప్రాంతీయ దురభిమానమూ, సమూహ భావనలకూ లోనయ్యే ప్రమాదముందని హెచ్చరిస్తూ, “మనమె పుడూ భారతీయులమే అన్న చేతన్యాన్ని ప్రజల్లో కలిగించడం అత్యావశ్యమని చెప్పడం మూలానా సమాజం నిత్య చైతన్యంతో విరజిల్లుతుంది

ఆధునిక భారతదేశంలో ఆర్బీఐ, సెంట్రల్ వాటర్ కమిషన్ వంటి అనేక సంస్థలు బాబాసాహెబ్ దూరదృష్టితో పురుడు పోసుకున్నవే. ఆర్థికశాస్త్రం, ఆర్థిక చరిత్రపై తన ప్రావీణ్యంతో భారత్ ఎదుర్కొంటున్న ద్రవ్య సమస్యలను ఆధారాలతో సహా ‘రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్’కు విశ్లేషణాత్మకంగా వివరించడంలో సఫలీకృతులైనారు. ఫలితంగా ఒక సెంట్రల్ బ్యాంక్ గా విధులను నిర్వర్తించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు పునాది పడింది.ఆధునిక ప్రపంచ చరిత్రలో మహిళల హక్కులకోసం కేంద్ర మంత్రి పదవిని తృణప్రాయంగా వదిలి మహిళా పక్షపాతిగా అంబేద్కర్ చరిత్రలో నిలిచిపోయారు అటువంటిది జనాభాలో 50శాతం ఉండే మహిళలను ఆకాశంలో సగం అంటున్నాం.అయితే ఇది కేవలం అర్భాటలకే పరిమితం అవుతుంది. ఆకాశంలో సగం అంటున్నామే కానీ,ఆ స్థాయిలో అవకాశాలను, అధికారాలను ఇవ్వడంలేదు, బీసీగా చెప్పుకునే ప్రధాని మోడీ మహిళా రిజర్వేషన్ల బిల్లుకు ఉత్సాహం కనబరుస్తున్న ఓబీసీ మహిళల వాటా తేల్చే ఆరాటం కన్పించడం లేదు. దామాషా ప్రకారం మహిళల వాటా తేల్చకుండా ఓసీల కొమ్ముగాసే పద్ధతిలో చట్టబద్ధత తెస్తే పొయ్యిమీద ఉన్న మహిళా రిజర్వేషన్లు పొయ్యిలో పడే ప్రమాదం ఉంది. విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు అనుభవిస్తున్న ఎస్సీ, ఎస్టీలకు బాబాసాహెబ్ అనే దేవుడు ఇచ్చిన వరం, రాజకీయాల్లో ఇచ్చిన బహుమతి గా చెప్పుకోక తప్పదు. ఓబీసీల వాటా తేల్చినందుకే గిలగిల కొట్టుకునే పరిస్థితి దాపురించింది. ఏది ఏమైనా ఈ దేశ అణగారిన బిడ్డలను సామాజిక,సాంస్కృతిక దాస్య శృంఖలాల నుంచి విముక్త చేసేందుకు తన జీవితాన్ని ధారపోసిన మహనీయులను స్మరించుకోవడం యావత్ జగత్ అందించే పుష్పాంజలి.



**ప్రొఫెసర్ సంగని మల్లేశ్వర్**
**విభాగాధిపతి, జర్నలిజం శాఖ,**
**కాకతీయ విశ్వవిద్యాలయం,**
**వరంగల్, 9866255355**

## ప్రకృతి సందేశం

వర్షం పడుతుంది
నేల సువాసన వెదజల్లుతుంది
కోయిల కూ కూ సరిగమల రాగాలతో
కూస్తుంది
పంటపొలాలు పచ్చగా
చూడముచ్చటగా కనిపిస్తాయి

ఏదో కనిపించడం లేదని
అటు, ఇటు, పైకి చూసాను
రంగులద్దిన ఇంద్రధనస్సు
తెల్లటి కాగితంపై చిత్రంలా మెరిసింది

ఆ విహరిస్తున్న పక్షులను చూస్తే
మనసులో ఓ లోచన మొలిచింది
పక్షపాతాలు లేవు,
బంధుత్వాల్లో భేదాలు అస్సలేవు

నడిచే మనిషి పక్షిలా ఎగరలేడు,
కానీ
జీవితం అనే ఈ ప్రయాణం
ఒక ప్రత్యేకమైన వరం
ఈ నగర వీధుల్లో జీవించడమే
మనకు దక్కిన అదృష్టపు వరం...

ధన్యవాదాలు...

**పేరు: గిద్దలూరు సాయి కిషోర్**
**పట్టణం : రాయదుర్గం**

# విద్యార్థి పోరాటాలకు రగిలే జ్వాల జార్జిరెడ్డి

ఉస్మానియా అరుణతార, హైదరాబాద్ చేగువేరా జార్జిరెడ్డి అమరత్వానికి నేటికీ 54ఏళ్లు, పూర్తి అవుతుంది. జార్జిరెడ్డి మన మధ్య లేకపోయినా ఆయన ఆలోచనలు సజీవంగా చిగురిస్తూనే ఉన్నాయి. జార్జిరెడ్డిని 1972 ఎప్రిల్ 14న మతోన్మాద గుండా మూకలు హత్య చేసాయి. జార్జి రక్తం చిందిన ఉస్మానియా నేలపై మొలకెత్తిన విత్తనాలు నేడు దేశవ్యాప్తంగా జార్జి అందించిన కర్తవ్య సాధన దిశగా ప్రయాణిస్తున్నాయి. ఆయన జ్ఞాపకాలు, పోరాట స్మృతులు, వర్తమాన కాలంలో సెలయేరు నదీ ప్రవహంలా జార్జి ఆలోచనలు వ్యాకోచించాయి. నూతన సమాజం కోసం, శాస్త్రీయ విద్యా విధానం సాధన కోసం అడుగులు ముందుకు వేస్తూ “జీనా హైతో మర్నా సీఖో, కధం కధం ఫర్ లడ్నా సీఖో” రణ నినాదంతో పి.డి.ఎస్.యూ జార్జి రెడ్డి స్ఫూర్తిని కొనసాగిస్తోంది.



**ఉస్మానియాలో విద్యార్థుల పరిస్థితులు**

1967లో జార్జి రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫిజిక్స్ లో అడ్మిషన్ పొందే నాటికి యూనివర్సిటీ అంతా మతోన్మాద కుల్లుతో నిండిపోయి ఉంది. అక్కడున్న ఏబీవీపీ విద్యార్థి నాయకులు గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్న పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను టార్గెట్ చేస్తూ ర్యాగింగ్ పేరుతో మహిళలపై వేధింపులకు గురి చేసేవారు. ఈ పరిస్థితిలో విద్యార్థుల పక్షాన నిలబడ్డ నాయకుడు జార్జిరెడ్డి ఇతను న్యూక్లియర్ ఫిజిక్స్ లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థి తన విద్యను వదిలేసి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం తపన చెందుతూ విద్యార్థులను చైతన్యం చేసి తమ హక్కుల కోసం పోరాటాలు నిర్వహించాడు. నిరంతరం జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను అధ్యయనం చేసి విద్యార్థులను సమీకరించి ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ రాజకీయ స్టడీ సర్కిల్ ను నిర్వహించి విద్యార్థులను ఉద్యమానికి సన్నద్ధం చేశాడు. గంటల తరబడి ఉస్మానియా లైబ్రరీలో అధ్యాయనం చేసేవాడు. 1960 దశకంలో ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు ఉద్యమ కేంద్రాలుగా మారిపోయాయి తూర్పు యూరప్ దేశాలు యుద్ధ భూమిని తలపిస్తుంటే అమెరికా చేస్తున్న యుద్ధంలో వియత్నాం విద్యార్థులు పుస్తకాలు వదిలేసి పిస్తోళ్లు చేతబ్బుని యుద్ధరంగంలో పోరాడుతున్న శబ్దాలు ఉస్మానియాకు తాకాయి. దేశంలో జరుగుతున్న నక్సల్‌బరి, శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటాలు గోదారిలోయ ప్రతిఘటన పోరాటాలు జార్జిని అత్యంత ప్రభావితం చేశాయి.

జార్జిరెడ్డి కుటుంబ నేపథ్యం 1947 జనవరి 15న కేరళలోని పాలఘట్‌లో జార్జిరెడ్డి జన్మించాడు. తండ్రి రఘునాద్ రెడ్డి చిత్తూరు (ఏపి) జిల్లా చల్లావారి పల్లె గ్రామం, తల్లి లీల దంపతులకు జన్మించాడు చిన్న వయసు నుండే సమాజంలో జరుగుతున్న దోపిడి అసమానతలను చూసి చలించి పోయాడు. ఎలాగైనా పేదవారికి న్యాయం చేయాలనే అకుంఠిత దీక్షతో పెరిగాడు. జార్జి విద్యాభ్యాసం కేరళలో తంగస్సేరి ఇన్ఫంట్ జీసస్ పాఠశాలలో ప్రారంభమైన విద్యాభ్యాసం మద్రాస్ ఎగ్మూర్ డాన్ బాస్కో స్కూల్, వరంగల్ గాబ్రియెల్ స్కూల్, హైదరాబాద్ హిమాయత్ నగర్‌లో సెంట్‌పాల్స్ హైస్కూల్స్ వరకు చదువు సాగింది. 1963లో నిజాం కాలేజీలో డాక్టర్ కావాలనే కొరికతో బైపిసిలో చేరాడు.1967లో ఉస్మానియాలో ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో చేరాడు. ఆనాటికి క్యాంపస్‌లో మతోన్మాద శక్తులు రాజ్యమేలుతున్నాయి. వయస్సు పెరుగుతున్న కొద్ది తన ఆలోచనలు, సమాజం పట్ల, సమాజంలో వున్న అంతరాలు, కుల అసమానతల మధ్య వైరుధ్యాల పట్ల జార్జి తీవ్రంగా ఘర్షణ పడేవాడు. హిందూ మతోన్మాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు.

**ఉస్మానియా యూనివర్సిటీపై జార్జి ప్రభావం**

ఆనాటి క్యాంపస్ మతోన్మాద శక్తులకు అడ్డాగా వుంది. బూర్జువా స్వభావం, పెత్తందారి తనంతో పేద విద్యార్థును హీనంగా చూడటం, సంవత్సరాల తరబడి హస్టల్స్‌ను కబ్జా చేసి విద్యార్థుల సౌకర్యలను అనుభవించేవారు. క్రింది స్థాయి ఉద్యోగులపై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ దాడులు చేసేవారు. ఆరఎసఎస్, ఏబీవీపీకి చెందిన వ్యక్తులు దౌర్జన్యంతో బోగస్ అడ్మిషన్లు పొందటం, విద్యార్థులకు అందవలసిన మెస్ సౌకర్యాలను స్వాహా చేసేవారు. విద్యార్థుల జేబుల్లోని డబ్బులను బహిరంగంగా దౌర్జన్యం చేసి తీసుకొనేవారు. ర్యాగింగ్‌కు పాల్పడేవారు. విద్యార్థినీలను బహిరంగంగా లైంగికంగా వేధించేవారు. మతోన్మాద శక్తుల నుండి తమను కాపాడే నాయకుని కోసం ఎదురు చూస్తున్న క్యాంపస్ విద్యార్థులకు జార్జిరెడ్డి రక్షకుడుగా వారికి కనిపించాడు. విద్యార్థులు ఉహించినట్లుగా జార్జి పేద విద్యార్థులకు, ఉద్యోగులకు అండగా నిలబడి వారిని సమీకరించి వారిలో ధైర్యాన్ని నింపాడు. ఈ క్రమంలోనే క్యాంపస్ ఎన్నికలు ప్రకటించారు.

1971లో జరిగిన ఎన్నికల్లో జార్జి ప్యానల్ విజయం సాధించటంతో మతోన్మాద గుండా మూరలు రెచ్చిపోయాయి. మతోన్మాదానికి విచక్షణా ఉండదు, కండ్లు కనిపించవు, పైశాచికత్వం దాని క్రీడ. దౌర్జన్యం దాని ఊపిరి అనట్లుగా జార్జిని టార్గెట్ చేసారు. అనేక సార్లు తనపై జరిగిన దాడులను జార్జి తిప్పికొట్టాడు దాడుల నుండి జార్జి బయటపడ్డాడు. జార్జి అధ్యయనంతో పాటు నిత్యం వ్యాయామం, బాక్సింగ్ చేయటం ద్వారా ఎప్పుడు దాడి జరిగినా యుద్ధానికి సిద్ధంగా వుండే సైన్యకుడుగా వుండేవాడు. నిత్య ఘర్షణల మధ్య తిరిగి 1972 ఏప్రిల్ 15న ఎన్నికల ప్రకటన వచ్చింది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ఏబీవీపీ, తన శక్తి సరిపోక బయట నుండి జార్జిని హత్య చేసేందు గుండాలను క్యాంపస్‌లో పెట్టింది. జార్జి మిత్రులు జార్జిని హెచ్చరించినా ఒంటరిగానే తిరిగేవాడు. కానీ 1972 ఎప్రిల్ 14న ఇంజనీరింగ్ కాలేజీ వద్ద పథకం ప్రకారం మాటు వేసిన ఏబీవీపీ, ఆరఎసఎస్, దూల్‌పేట గుండాలు కలిసి కత్తులతో పొడిచి జార్జిని హత్య చేసారు. వాస్తవంగా జార్జి నిర్వహించే స్టడీ సర్కిల్లో ఏప్రిల్ 14న లెనిన్ రాసిన “సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ” అనే పుస్తకంపై చర్చించాలి” కానీ ఎన్నికల కారణంగా వాయిదా వేశారు. వ్యవస్థ పట్ల జార్జి ఆలోచనలు విశ్వవ్యాపితంగా వున్నాయి. ఆయన హత్యను భారత దేశ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు ఖండించి, నివాళి అర్పించారు. జార్జికి పాఠాలు చెప్పిన గురువుల దగ్గర నుండి అనేక మంది జార్జి హత్య తరువాత “ఒక మేధావిని ఈ దేశం కొల్పోయిందన్నారు.” ప్రగతిశీల విద్యార్థులు జార్జి కర్తవ్యాన్ని సాధిస్తామని ప్రతినబూనారు. జార్జి ఇచ్చిన సమర నినాదం “జీనా హైతో మరణా సిఖో కధం కధం పర్ లడ్నా సీఖో” జీవించాలంటే మరణించడం నేర్చుకో అడుగడుగునా పోరాటం నేర్చుకో.... నినాదం అనేకమంది విద్యార్థులను ఆలోచింపజేసి ప్రగతిశీల ఉద్యమాలకు బాటలు వేసింది జార్జి అమరత్వ స్ఫూర్తితో విద్యారంగంలో మనువాద భావాజాలానికి వ్యతిరేకంగా నేడు ప్రగతిశీల ఉద్యమాలు ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతో ఉంది. జార్జిని పొట్టన పెట్టుకున్న వారు నేడు దేశంలో అధికారంలో ఉండి విద్యారంగాన్ని పూర్తిగా మతోన్మాద భావజాలంతో నింపే ప్రయత్నాలు చేస్తున్నారు విద్యార్థుల మెదళ్లను విషతుల్యం చేస్తూ మనుధర్మ శాస్త్రాన్ని, పుక్కిటి పురాణాలని, జ్యోతిష్యం లాంటి అశాస్త్రీయమైన సబ్జెక్టులను తీసుకొచ్చి దేశాన్ని మూఢనమ్మకాల వైపుగా మళ్లిస్తున్నారు. అందుకే జార్జి అందించిన పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ మతోన్మాద ఫాసిస్టు భావజాలం వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలి.

**(ఏప్రిల్ 14 జార్జిరెడ్డి 54 వర్ధంతి సందర్భంగా)**



**పొడపంగి నాగరాజు**
M.A., (LL.B), OU
**పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
**9948333900**

# విగ్రహం నుంచి విముక్తి.. నివాళి నుంచి నిజాయితీవైపు..!

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వచ్చిందంటే చాలు గల్లీ నుంచి ఢిల్లీ దాకా నీలిరంగు రెపరెపలాడుతుంది. మైకుల మోత, పూలమాలల అలంకరణలతో విగ్రహాల వద్ద కోలాహలం కనిపిస్తుంది. కానీ, ఈ బాహ్య ప్రదర్శనలన్నీ బాబా సాహెబ్ ఆశించిన ‘భారతాన్ని’ నిర్మిస్తున్నాయా.? లేక ఆయనను ఒక దేవుడిగా మార్చి, ఆయన విప్లవాత్మక భావజాలాన్ని అటకెక్కిస్తున్నాయా.? అనేది ఇవాళ ప్రతి అంబేద్కరిస్టు, ప్రతి సామాజిక కార్యకర్త వేసుకోవాల్సిన ఆత్మవిమర్శనాత్మక ప్రశ్న. ?అంబేద్కర్ పేరుతో ఇవాళ వేల సంఖ్యలో సంఘాలు పుట్టుకొచ్చాయి. ప్రతి వీధిలో ఒక కమిటీ ఉంది. అయితే, ఈ సంఘాలు చేస్తున్న దేమిటి? కేవలం జయంతి, వర్ధంతులకు పరిమితం కావడం, విగ్రహాల ఎత్తుపై పోటీ పడటం, లేదా రాజకీయ పార్టీల వద్ద ‘సీట్ల’ కోసం, ‘పదవుల’ కోసం బేరసారాలు చేయడం దగ్గరే ప్రస్థానం ఆగిపోతోంది. ?అంబేద్కర్ అంటే కేవలం ఒక కులానికి చెందిన నాయకుడో, లేదా రాజ్యాంగం రాసి ఇచ్చిన ఒక చట్టబద్ధ అధికారి మాత్రమే కాదు. ఆయన ఒక నిరంతర చైతన్యం. ఆయనను ఒక వర్గానికి పరిమితం చేయడం అంటే ఆయనను మరోసారి అంటరాని వాడిని చేయడమే. సమాజాన్ని ఉద్ధరిస్తున్నామని చెప్పుకునే నేతలు, తమ కోసం అంబేద్కర్ పేరును ఒక కవచంలా వాడుకుంటున్నారే తప్ప, ఆయన కలగన్న సామాజిక ప్రజాస్వామ్యాన్ని కింది స్థాయికి తీసుకెళ్లడంలో ఘోరంగా విఫలమవుతున్నారు. విగ్రహం చుట్టూ తిరగడం కాదు, విగ్రహం చూపిన దిశ వైపు నడవడం నేర్చుకోవాల్సిన అవసరం ఉంది

ఇక తెలుగు నేలపై అంబేద్కరిజం, మార్క్సిజం మధ్య దశాబ్దాల కాలంగా ఒక అనవసర సైద్ధాంతిక గోడ ఉంది. మార్క్సిస్టులు ‘వర్గాన్ని’ మాత్రమే చూస్తే, అంబేద్కరిస్టులు ‘కులాన్ని’ మాత్రమే ప్రాతిపదికగా తీసుకున్నారు. కానీ, భారతీయ సామాజిక స్థితిగతుల్లో కులం అనేది కేవలం సామాజిక అంతరం మాత్రమే కాదు, అది ఒక పక్కా ఆర్థిక వ్యవస్థ. అంబేద్కర్ ప్రతిపాదించిన రాజ్య సోషలిజంకు, మార్క్స్ చెప్పిన శ్రామిక వర్గ విముక్తికి మధ్య ఉన్న సామీప్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది. కుల నిర్మూలన జరగకుండా ఇక్కడ వర్గ పోరాటం విజయం సాధించదు, అలాగే ఆర్థిక సమానత్వం లేకుండా సామాజిక గౌరవం నిలబడదు. శ్రమ విభజన కాదు, శ్రామికుల విభజన జరుగుతున్న ఈ దేశంలో.. ఈ రెండు సిద్ధాంతాలూ పరస్పర సహకారం లేకుండా ముందుకు సాగలేవు. ఈ సత్యాన్ని అంబేద్కరిస్టులం, మార్క్సిస్టుశిబిరాలు ‘ఇగో’ లను పక్కనపెట్టి గుర్తించాలి. అంబేద్కరిజం - మార్క్సిజానికి తోడుగా మనోవిశ్లేషణ సిద్ధాంతాన్ని జోడించాల్సిన అవసరం ఉంది.

ఈ రెండు సిద్ధాంతాల మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చడానికి దివంగత మానవ హక్కుల నేత కె. బాలగోపాల్ ఆలోచనా విధానం ఇవాళ అత్యంత కీలకం, అవసరమని కూడా గుర్తించాలి. పరిగణలోకి తీసుకోవాలి. మార్క్సిజంతో ప్రస్థానం ప్రారంభించి, ఆ తర్వాత దళిత, బహుజన ఉద్యమాల ప్రాధాన్యతను గుర్తించిన బాలగోపాల్ ఒక గొప్ప సమన్వయకర్త. “కులం ఒక వాస్తవం, వర్గం ఒక సత్యం” అని ఆయన గుర్తించారు. కేవలం ఆర్థిక మార్పు వస్తే కులం పోతుందని భావించడం మార్క్సిస్టుల పొరపాటని, అలాగే కేవలం కుల అస్తిత్వంతోనే పూర్తి విముక్తి వస్తుందని అనుకోవడం అంబేద్కరిస్టుల పరిమితి అని ఆయన ఎత్తిచూపారు. హక్కుల పోరాటంలో మానవీయ కోణాన్ని జోడించి, రాజ్యాంగ పరిధిలో ఉంటూనే విప్లవాత్మక మార్పు ఎలా సాధ్యమో బాలగోపాల్ ఆలోచన, ఆచరణ తెలుపుతుంది. నేటి తరానికి ఆ సమన్వయ దృక్పథం అవసరం. ?అంబేద్కర్ సంఘాలు, మేధావులు కేవలం భావోద్వేగపూరిత ఉపన్యాసాలకే పరిమితం కాకూడదు. విగ్రహాల అలంకరణ కంటే ఆచరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. సంఘాల్లో వ్యక్తుల ఆరాధన మానేసి, సామాజిక సమస్యలపై మేధోమథనం చేయాలి. అధికారం ఏ పార్టీ చేతిలో ఉన్నా, అణగారిన వర్గాల హక్కులకు భంగం కలిగినప్పుడు రాజీ లేని పోరాటం చేయాలి. బాలగోపాల్ ఆశించినట్లుగా.. కులం, వర్గం, లింగ వివక్షలకు వ్యతిరేకంగా పనిచేసే అన్ని ప్రజాస్వామ్య శక్తులను ఒకే తాటిపైకి తీసుకురావాలి. అంబేద్కర్ అంటే కోటు వేసుకున్న విగ్రహం కాదు. అన్యాయాన్ని చూసి తిరగబడే ఒక ఆలోచన. ఆయనను ఫోటోల నుంచి గుండెల్లోకి, ఊరేగింపుల నుంచి ఆచరణలోకి మార్చుకున్నప్పుడే మనం ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుంది. లేకపోతే, ఏటా చేసే జయంతులు కేవలం ఒక వార్షిక ఉత్సవంగా మిగిలిపోతాయి తప్ప, వ్యవస్థలో మార్పు రాదు. వ్యవస్థ మారాలి.. మనిషి మారాలి.



**రాజేందర్ దామెర**
**(దారా)**
**సీనియర్ జర్నలిస్ట్**
rajenderdamera@mail.com

# వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరుకోవాలి

- హుస్నాబాద్ ఏసీపీ ఎస్. సదానందం

కోహెడ, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : వాహనదారులు సురక్షిత ప్రయాణంతో, ప్రాణాలతో గమ్యం చేరుకోవాలి అని హుస్నాబాద్ ఏసీపీ ఎస్ సదానందం అన్నారు. సోమవారం రోడ్డు భద్రతపై కోహెడ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోహెడ మండల పరిది లోని గ్రామాలలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, కోహెడ యస్.ఐ పుల్లా అభిలాష్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది .ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లు పోలీస్ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి వాహనం పై బయలుదేరి పని ముగించుకుని మరల తిరిగి ఎలా అయినా కాదు ప్రాణాలతో ఇంటికి సురక్షితంగా చేరుకోవాలని ఏసిపి అన్నారు. ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమేనని తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని చెప్పారు.



వాహనదారులు తమ భద్రత కోసం, తమ కుటుంబాల కోసం తప్పకుండ ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. పోలీసులు సేకరించిన ప్రమాదాల వివరాలను విశ్లేషించగా, ఎక్కువ ప్రమాదాలకు వాహనదారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని వెల్లడైంది అన్నారు. కారు, లారీ, బైక్, ట్రాక్టర్ డ్రైవర్లు సైతం ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అలాగే హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ యువత విద్యపై దృష్టి పెట్టి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి కుటుంబాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా నిర్లక్ష్యమైన డ్రైవింగ్ చేస్తూ ప్రాణాలను కోల్పోయి గాయాలపాలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అన్నారు. అలాగే ముఖ్యంగా ట్రాక్టర్లలో భారీ శబ్దంతో సంగీతం పెట్టడం వల్ల హారన్ వినిపించకపోవడం, బైక్ పై వెనుక కూర్చున్న వారు హెల్మెట్ ధరించకపోవడం వంటి అంశాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని అన్నారు. అలాగే స్థానిక కోహెడ యస్.ఐ పి అభిలాష్ మాట్లాడుతూ రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ ఉపయోగించడం వంటి చర్యలను పూర్తిగా నివారించాలని ఆయ సూచించారు. ప్రజల సహకారం లేకుండా పోలీసుల ప్రయత్నాలు ఫలించవని అన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, యువత అందరితో రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని, అలాగే మిగతా వారితో పాటించేలా చూస్తామని అన్నారు. తమ వంతు కృషి తప్పక చేస్తామని ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోతు లింగం, పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యువత వ్యాపార రంగంలో రాణించాలి



షాబాద్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) : యువత వ్యాపార రంగంపై మొగ్గు చూపి స్వయం శక్తితో ఎదగాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐతాబాద్ లో శేరిగూడ గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్ నూతనంగా ఏర్పాటు చేసిన ఆన్లైన్ సెంటర్ ను సోమవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... అభివృద్ధి చెందుతున్న షాబాద్ మండలంలో అనేక రకాల అవసరాలకు తగ్గట్టు వ్యాపార రంగంపై యువత దృష్టి సారించాలని అన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అనేక సబ్సిడీ రూపంలో సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, హైతాబాద్ సర్పంచ్ కర్రోళ్ల శాంతమ్మ, మిద్దంగూడ మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, పార్టీ నాయకులు మహమ్మద్ కాజా మియా పటేల్, జనార్ధన్ రెడ్డి, ఎండి జాంగిర్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, సుభాష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి.. మున్సిపల్ ఆఫీస్ ముందు మహిళల ధర్నా



జడ్చర్ల, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : మున్సిపాలిటీ పరిధిలోని పాత బజార్ ప్రాంతంలో తాగునీటి కష్టాలు రోడ్డెక్కాయి. గత పది రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ స్థానిక మహిళలు సోమవారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఖాళీ బిందెలతో కార్యాలయం ముందు బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ పది రోజులుగా నల్లాలు రాకపోవడంతో గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో కనీసం ఒక్క బోరు బావి కూడా అందుబాటులో లేదని, తాగునీటి కోసం మైళ్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. వేసవి ఎండలు ముదురుతున్న తరుణంలో నీటి సరఫరా నిలిపివేస్తే తాము ఎలా బతకాలని అధికారులను నిలదీశారు. మహిళల ఆందోళనతో మున్సిపల్ కార్యాలయం వద్ద కాసేపు ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని నిరసనకారులతో చర్చలు జరిపారు. సాంకేతిక కారణాల వల్ల సరఫరాలో అంతరాయం కలిగిందని, తక్షణమే కాలనీకి నీటి ట్యాంకర్లను పంపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే శాశ్వత ప్రాతిపదికన నీటి సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇవ్వడంతో మహిళలు తమ నిరసనను విరమించారు.

## ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఫీల్డ్ అసిస్టెంట్ల, టిఎల వేతనాలు ఇవ్వాలి
- అధికారుల వేధింపులు వెంటనే ఆపాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి, గొల్లపల్లి జయరాజు
- కలెక్టరేట్ ఎదుట నిరసన
- సంగారెడ్డి కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం



సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) : ఉపాధి హామీ కూలీల బకాయి వేతనాలు, ఫీల్డ్ అసిస్టెంట్,టి ఏ, సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం. కలెక్టరేట్ ఎదుట నిరసన సంగారెడ్డి కలెక్టరేట్ సూపరింటెండెంట్ శంబు రెడ్డి కి వినతి పత్రం ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీల బకాయిలు వెంటనే చెల్లించాలని,ఫీల్డ్ అసిస్టెంట్ల, టి ఏల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులు వెంటనే ఆపాలని అన్నారు. కూలీల కు ఫొటో క్యాపర్చర్ ను వెంటనే తొలగించాలని అన్నారు. కూలీల కు పనిముట్లు,నీడ కు టెంట్,మంచి నీళ్లు, మెడికల్ కిట్టు ఇవ్వాలని అన్నారు. సమస్యలు పరిష్కారం చేయకుండా వేధింపులకు గురి చేయటం సరికాదన్నారు. లేనిచో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం.నర్సిములు నాయకులు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా హత్య కేసును ఛేదించిన చేర్యాల పోలీసులు

- మీడియా సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం

చేర్యాల, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : ఈ నెల 8వ తేదీన చుంచనకోట శివారులో గుర్తు తెలియని మహిళా మృతదేహం లభించడంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేసి మృతురాలి వివరాలు ఎస్ కె జరీనా అని లభించడంతో చేర్యాల పోలీస్ వారు క్రైమ్ నం. 90/2026 దర్యాప్తు చేయడం ప్రారంభించి హత్య కేసును పోలీసులు ఛేదించారు. సోమవారం చేర్యాల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందం కేసు వివరాలను వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఆలింపూర్ గ్రామానికి చెందిన జరీనా అనే మహిళకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ మండలం మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన షేక్ మౌలానా (36)కు 2024 ఏప్రిల్ నెలలో జరిగిన ఒక కుటుంబ కార్యక్రమంలో పరిచయం ఏర్పడింది. అనంతరం వీరి ఇద్దరి మధ్య అక్రమ




సంబంధం ఏర్పడి తరచుగా ఫోన్ ద్వారా సంప్రదింపులు కొనసాగించారు. కాలక్రమేణా మృతురాలు నిందితుడి వద్ద వివిధ కారణాలతో డబ్బులు డిమాండ్ చేయడం ప్రారంభించి, డబ్బులు ఇవ్వకపోతే అతని ఇంటికి వచ్చి వారి సంబంధాన్ని బయటపెట్టి అవమానపరుస్తానని బెదిరించడంతో నిందితుడు మానసికంగా ఒత్తిడికి గురై, మృతురాలిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 8వ తేదీన నిందితుడు తన కారు టీఎస్ 27సీ0577లో మృతురాలిని చేర్యాల శివారులోని గుర్జకుంట వాగు సమీపంలో మద్యం కొని సేవించి, మరోసారి బీర్లు కొనుక్కొని చేర్యాల నుండి చుంచనకోట రూట్ లోకి తీసుకెళ్లి, అక్కడ ఎవరు లేనిది ప్రాంతంలో ఇద్దరూ మద్యం సేవించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా కోపోద్రిక్తుడైన నిందితుడు మృతురాలిపై దాడి చేసి, స్కార్ఫ్‌తో మెడ నులిమి హత్య చేశాడు.హత్య అనంతరం, నిందితుడు మృతురాలి మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని ప్రదేశంలో పడేసి, సాక్ష్యాలను చెరిపివేయడానికి ప్రయత్నించాడు. అనంతరం ఇంటికి వెళ్లిపోయాడు. ఆ తర్వాత దర్యాప్తు చేపట్టిన చేర్యాల పోలీసులు నిందితుడిని చేర్యాల శివారులో అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకోవడంతో అతని వద్ద నుండి నేరానికి వాడిన కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.తర్వాత అతఃనిని రిమాండ్ కు తరలించనైనది.ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ బానోతు రమేష్ నాయక్, ఎస్సై గూడ అపూర్వ రెడ్డి, కానిస్టేబులు హనుమంతు, కిరణ్ పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం




శామీర్‌పేట్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) : పేదల సొంతింటి కలను సాకారం చేయడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. శామీర్‌పేట్ 300వ డివిజన్ దేవరయాంజాల్‌లో సోమవారం ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు,మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరై లబ్ధిదారులు మామిడ్ల అశోక్ దంపతులు సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించుకున్న ఇందిరమ్మ గృహాన్ని అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, శుభాకాంక్షలు తెలియజేసి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ వసతి కల్పించడం జరుగుతోందన్నారు.పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఇలాంటి సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సమర్థంగా వినియోగించు కోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు.ఇళ్లు పూర్తి కావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ,తమకు సహ కరించిన నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్,మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు విలాసాగర్ అశోక్,శ్రీ సీతారామ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పేండం లక్ష్మినారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకుడు నక్క సందీప్ గౌడ్, మాజీ ధర్మకర్తలు ఎల్లెంకి భారతి,వలందాసు మురళి గౌడ్,నానిగళ్ళ హరిగోపాల్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పిన్నింటి ధర్మారెడ్డి, సుతారిగూడెం దుర్గయ్య,రాజబోయిన శ్రీనివాస్ యాదవ్,కాంగ్రెస్ నాయకులు మిర్యాలకర్ సాయి కుమార్, మోత్కుల మల్లేష్ యాదవ్,రాపని శ్రీనివాస్,ఎల్ ఈరలాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల చర్చలు విఫలం

- సమ్మెకు సైరన్

ముషీరాబాద్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) : ఆర్టీసీ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా ఈనెల 21 అర్ధరాత్రి నుండి సమ్మెకు వెళ్తున్నట్లు టిజిఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు ఈదురు వెంకన్న ప్రకటించారు. కార్మికుల సమస్యలపై పలుమార్లు నోటీసులు అందించినా ప్రభుత్వం నుండి గాని, యాజమాన్యం నుండి గాని ఎలాంటి స్పందన లేదని, లేబర్ కమిషనర్ తో సోమవారం ఆర్టీసీ జేఏసీ నాయకులు జరిపిన చర్చలు విఫలమయ్యాయని, నిరసనగా ఈనెల 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు స్పష్టం చేశారు. కార్మికులను బలవంతంగా సమ్మెలకు నెట్టే లా యాజమాన్యం వ్యవహరిస్తుందని, కొత్త డిమాండ్లు ఏవి అడగలేదని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టిసి ని ప్రభుత్వంలో విలీనం చేయాలని, సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని, తదితర 32 డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. ఆర్టీసీ విలీనం యూనియన్ ఎన్నికల కోసం కమిటీ వేసామని మంత్రి చెబుతున్నారని, ఇంతవరకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయలేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు సమస్యలు విన్నవిస్తున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**21 అర్ధరాత్రి నుండే సమ్మె...**



ఆర్టీసీ కార్మికుల నిర్వహించనున్న స సమ్మె ఈనెల 21 అర్ధరాత్రి నుండి మొదలవుతుందని, ఏ ఒక్క కార్మికుడు 22వ తేదీ మొదటి డ్యూటీ నుంచి విధులకు హాజరు కాకూడదని జేఏసీ పిలుపునిచ్చింది. 40 వేల మంది కార్మికులు జేఏసీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నారని టిజిఎస్ ఆర్టిసి జేఏసీ ప్రకటించింది. ఎవరైనా వేరే ఆలోచనలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించింది.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీపీ మండల్ సిఫారసులను అమలు చేయాలి

- బీపీ మండల్‌కు భారతరత్న కేటాయించాలి
- ట్యాంక్‌బండ్‌పై మండల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- యాదవ జేఏసీ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

ముషీరాబాద్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) : బీపీ మండల్ సిఫారసులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని యాదవ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ జేఏసీ ఆధ్వర్యంలో యాదవ రాజకీయ సదస్సును నిర్వహించారు. బీపీ మండల్ (బిందేశ్వర ప్రసాద్ మండల్) 44 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కల్పించిన ఘనత బీపీ మండల్ కే దక్కుతుందన్నారు. బీపీ మండల్ కు భారతరత్న అవార్డు ఇవ్వాలనీ, ట్యాంక్ బండ్ పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని



డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో బీపీ మండల్ ఉద్యమం ద్వారానే యాదవులు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ మరో మండల్ ఉద్యమం గ్రామ గ్రామాన చేపడతామన్నారు. పార్లమెంట్ లో బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేయాలనీ కోరారు. 70 కోట్ల ఓబీసీల ఆరాధ్య దైవం బీపీ మండల్ జయంతి, వర్ధంతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అధికారంగా నిర్వహించాలన్నారు. బీపీ మండల్ జీవిత చరిత్రను పాఠ్యాంశ పుస్తకాలలో చేర్చాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులాలు, బహుజన కులాలను కలుపుకొని యాదవులు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ జేఏసీ వైస్ చైర్మన్ చిలుకల శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధి రమేష్ యాదవ్,ప్రధాన కార్యదర్శి బీనవేని మల్లేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్లు మేకల శివశంకర్ యాదవ్,గంగుల మధు యాదవ్,బెల్లి చంద్రశేఖర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి బీనవేని మల్లేష్ యాదవ్,ఉపాధ్యక్షుడు దారమోనీ బక్కన్న యాదవ్,కార్యదర్శులు కదారి కాశీం,తోకల మహేష్ యాదవ్,గడ్డం శ్రీనివాస్ యాదవ్,యూత్ అధ్యక్షుడు నారమోని నరేష్ యాదవ్,మహిళా అధ్యక్షురాలు మంజుల వాణి యాదవ్, లీగల్ సెల్ అధ్యక్షుడు జుర్రు అరుణ్ యాదవ్,మీడియా గౌరవ అధ్యక్షుడు భేరి రామచందర్ యాదవ్,ఆర్గనైజింగ్ సెక్రటరీ అంజి యాదవ్,మీడియా కన్వీనర్ ప్రశాంత్ యాదవ్,సలహాదారులు చిట్టబోయిన నంద కిషోర్ యాదవ్,బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్,టీఆర్ పీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాండు యాదవ్,అంబర్ పేట్ శ్రీనివాస్ యాదవ్,ఈశ్వరమ్మ యాదవ్,అడ్వకేట్ నాగుల శ్రీనివాస్ యాదవ్,ప్రొఫెసర్ నాగుల వేణు యాదవ్,నక్క శ్రీనివాస్ యాదవ్,పలువురు యాదవ జేఏసీ నేతలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

- యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలు గౌడ్

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : విద్యారంగ సమస్యలపై యూటిఎఫ్ రాజీలేని పోరాటం నిరంతరంగా కొనసాగిస్తుందని జిల్లా కార్యదర్శి నర్సింలు గౌడ్ అన్నారు షాద్ నగర్ పట్టణంలో టిఎస్ యూటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎంఆర్సి కార్యాలయ ఆవరణలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణయ్య జెండా అవిష్కరణ అనంతరం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ యూటిఎఫ్ విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయ రంగ సమస్యలపై నిరంతరం పోరాటం



చేస్తూనే పాఠశాలలో కూడా నిజాయితీగా బాధ్యతాయుతంగా చేస్తున్నారని టీఎస్ యూటిఎఫ్ సామాజిక స్పృహతో అనేక సామాజిక అంశాలపై కూడా పని చేసే సంఘమని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శిలు కే.వెంకటయ్య, జి శివారెడ్డి ఫరూక్ నగర్ మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవమ్మ బిజిలి సత్యం,షాబాద్ మండల అధ్యక్షులు పి.శేఖర్ గౌడ్ కేశంపేట్ మండల ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ బాలయ్య వలిగి కృష్ణ, రాములు, మహేష్ పరమేశ్వరి.తదితరులు పాల్గొనడం జరిగింది.

# పంచాయతీ కార్యదర్శులను వెంటనే బదిలీ చేయాలి

- బదిలీ మార్గదర్శకాలు ఎక్కడ..?
- బదిలీల ఉసేత్తని పంచాయతీ యంత్రాంగం
- జీవో 80 ప్రకారం బదిలీలకు వెసులుబాటు
- 6 ఏండ్లు గడుస్తున్నా బదిలీలపై స్పందించని అధికారులు
- కార్యదర్శులు స్వలాభం కోసం విధులు
- ఇంచార్జ్ వ్యవస్థకు స్వస్తి చెప్పాలి
- గ్రేడ్‌ల వారిగా కాకుండా సర్వీస్ ప్రకారం బదిలీలు ఉండాలి
- గ్రామ పంచాయతీల పనితీరులో పారదర్శకత నిష్పాక్షతతో విధులు నిర్వహించాలి
- గ్రామాల్లో అధికార పార్టీకి కార్యదర్శిలు మొగ్గు చూపటంపై మరో వాదన




**మనోహరాబాద్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** గత కొన్ని సంవత్సరాలుగా గ్రామపంచాయతీ పాలకమండలి లేకపోవడంతో భారం పంచాయతీ కార్యదర్శులకు పెరిగినప్పటికీ పంచాయతీ కార్యదర్శులను వెంటనే బదిలీ చేయాలి గత ప్రభుత్వం నుండి విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు రెండున్నర సంవత్సరాలు గ్రామ పాలక మండలి లేకపోవడంతో పూర్తిగా గ్రామానికి సంబంధించిన విధులు బాధ్యతలు నిర్వర్తించినప్పటికీ పరిపాలన సౌలభ్యం కోసం నిష్పక్షపాతంగా పనిచేయడానికి బదిలీలు తప్పనిసరి అవసరం గ్రామపంచాయతీ కార్యదర్శుల బదిలీ మార్గదర్శకాలు ఎక్కడ అనేది ప్రశ్నార్థకంగా మారింది బదిలీ మార్గదర్శకాల నిబంధనలో భాగంగా రెండు సంవత్సరాల కన్నా ఎక్కువ ఒక గ్రామంలో విధులు నిర్వహించిన వారికి బదిలీలు తప్పకుండా అవసరమే బదిలీల ప్రక్రియలో ఎప్పటికప్పుడు ప్రభుత్వం జీవోలతో వెసులుబాటు కల్పించాలి జీవో 80 ప్రకారం పంచాయతీ కార్యదర్శులకు బదిలీల వెసులుబాటు తప్పనిసరి గ్రేడ్ల సర్వీస్ నిబంధనల ప్రకారం సమకాలిన కాలానికి అనుగుణంగ నిబంధనలో వెసులు బాట్లు కల్పించాలి ఆరేండ్లు గడుస్తున్న పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై దృష్టి సాధించని పంచాయతీ అధికారులు గత ప్రభుత్వంలో ఉన్న అధికారులు రెండున్నర సంవత్సరాలు పంచాయతీ పాలకమండలి లేకపోవడంతో బదిలీల ప్రస్తావనకు రాలేదు జిల్లాలో పంచాయతీ యంత్రాంగం నూతన ప్రభుత్వంలో అనేక మార్పులు రావడం వలన బదిలీలపై స్పష్టత ఇవ్వలేకపోతున్న ఉన్నత అధికారులు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులకు ఇన్చార్జి వ్యవస్థకు స్వస్తి చెప్పాలి ఇన్చార్జిగా విధులు నిర్వర్తించడం వలన రెండు మూడు గ్రామాల్లో బాధ్యతాయుతంగా విధుల నిర్వర్తించడం అనేది పారదర్శకతకు కొరవడి ఏర్పడుతుంది విధుల్లో బాధ్యతాయుతమైన ఇబ్బందులు ఎదురవుతూ ఉంటాయి కనుక పై అధికారులు విశ్లేషించి ఇంచార్జ్ వ్యవస్థను రద్దు చేయాలి కార్యదర్శుల స్వలాభం కోసం కొన్ని సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో సౌలభ్యం కోసం విధులు నిర్వర్తించడం జరుగుతుంది కొంతమంది పంచాయతీ కార్యదర్శులలో గందరగోళం సంతరించుకుంది కొన్ని సమయాల్లో పంచాయతీ నిధులు కేటాయించకపోవడం వలన అధికారులు తమ సొంత నిధులను వెచ్చించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించినప్పటికీ పెద్ద పెద్ద గ్రామపంచాయతీలో లక్షల రూపాయలు నిధులు వెచ్చించడం వలన మరల వేరే గ్రామాలకు బదిలీ అవుతే నిధులు ప్రభుత్వం నుండి రావు అనే భయభ్రాంతులతో కొంతమంది అధికారులు ఒక ప్రాంతానికి పరిమితం అయిపోతున్నారు ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శుల బిల్లులను సకాలంలో చెల్లించాలి. గ్రేడ్ల వారిగా కాకుండా పంచాయతీ కార్యదర్శులను సర్వీస్ ప్రకారం నిబంధనలకు లోబడి బదిలీలను ముమ్మరం చెయ్యాలి జీవోలో 40 శాతం మించి బదిలీలు చేయొద్దని గ్రేడ్ల వారీగా గ్రేడ్ వన్ కార్యదర్శులను అదే స్థాయి పంచాయతీలకు గ్రేడ్ 5 మరియు ఆరు కార్యదర్శులను అవసరమైన స్థానానికి బదిలీ చేస్తారు కేవలం నాలుగేండ్లు పూర్తి చేసుకున్న కార్యదర్శులను బదిలీ చేస్తున్నారని మరొక డిమాండ్ జీవో 80 ప్రకారం రెండేళ్లలో సర్వీస్ పూర్తి చేసుకుని ప్రభుత్వం ఇచ్చిన జీవ ప్రకారం 40 శాతం లోపల ఉన్న కార్యదర్శులను వెంటనే బదిలీ చేయాలి గ్రామాల్లో కార్యదర్శులు అధికార పార్టీకి ముగ్గ చూపటం మరో వాదనకు తెరలేపుతుంది గ్రామాల్లో కార్యదర్శులు అధికారంలో ఉన్న సర్పంచులకు మరియు ఇతర నాయకులకు లోబడి విధులు నిర్వహిస్తున్నారని ప్రత్యేక వాదనలు వినిపిస్తున్నాయి గ్రామాల్లో కార్యదర్శులు పనితీరులో అందరికీ పారదర్శకంగా నిష్పక్షతతో విధులు నిర్వహించాలి నూతన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా కార్యదర్శుల బదిలీల ఉసేత్తకపోవడం పై అధికారుల నిర్లక్ష్యానికి ఇదొక నిదర్శనం పంచాయతీ కార్యదర్శుల బదిలీ మార్గదర్శకాలను రూపొందించాలి.

## టోకెన్ల ద్వారా ధాన కొనుగోలు చేయాలి

- ఎండల తీవ్రత దృశ రైతులు ఇబ్బంది పెట్టొద్దు
- తహసీల్దార్ శ్రీనివాస్



**వెల్దుర్తి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** ధాన్యము కొనుగోలులో నిర్వాకులురైతులను ఇబ్బందులు పెట్టవద్దని మండల తాసిల్దార్ శ్రీనివాస్ అన్నారు.సోమవారం మండలంలోని హస్తాల్పూర్ గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున రైతులకు ధాన్యం కొనుగోలు కోసం ఇచ్చిన టోకన్ల ద్వారానే ఒక క్రమబద్ధీకరణలోధాన్యాన్ని సేకరించాలన్నారు. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి ఏగ్రేడ్ రకానికి రూ 23 89 బి రకానికి రూ2369 మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు సన్న రకం ధాన్యానికి అదనంగా రూ 500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు రైతులు దళారీల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. పిఎసిఎస్ ద్వారా ఉప్పు లింగాపూర్ కుక్కునూరు అచ్చంపేట మాసాయిపేట నెల్లూరు మంగళపర్తి మానేపల్లి దామరంచ మన్నే వారి జలాల్పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయా గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ పిఎసిఎస్ సీఈవో అశోక్ సర్పంచులు నరసింహారెడ్డి భూపాల్ రెడ్డి రంగారెడ్డి కృష్ణారెడ్డి సంధ్యా రామకృష్ణారావు నాగమణి సోమప్ప కృష్ణ నిర్వాహకులు పాల్గొన్నారు.

## జీవో నం. 11 ప్రకారం వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి



**శివ్వంపేట, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** జీవో 11 ప్రకారం మిషన్ భగీరథ కార్మికులకు ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో మిషన్ భగీరథ కార్మికుల మండల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూరత్నమ్మ కన్స్ట్రక్షన్ ప్రైవేట్ సంస్థలో మిషన్ భగీరథ కార్మికులు దాదాపుగా వంద మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీళ్లందరికి 5, 6 నెలలుగా వేతనాలు పెండింగులో ఉన్నాయని, ఉన్న వేతనలు కూడా జీవో నెంబర్ 11 ప్రకారం ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. అన్ని వేతనాలు జీవో ప్రకారం కార్మికుల అడిగితే బెదిరింపులకు గురి చేస్తూ విధుల నుండి తొలగిస్తున్నారని, ఐదారు నెలల నుండి వేతనాలు లేకుండా కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆయన ప్రశ్నించారు.ఇచ్చే వేతనలలో కూడ వ్యత్యాసాలు ఉన్నాయని, కార్మికుల అందరికీ పెండింగ్ లో ఉన్న వేతనాలను చెల్లించాలని, అలాగే ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యాలను కార్మికులకులందరికి కల్పించాలని,పెట్రోల్ అలవెన్స్ ను, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు నర్సింలు, స్వామి, మల్లేష్,అశోక్,పోచయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఆక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

- కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సమావేశం
- టియుడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి



**సంగారెడ్డి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఆక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని టియుడబ్ల్యు జే (ఐ జె యు) జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి కలెక్టర్ ను కోరారు. సంగారెడ్డి జిల్లా లో నూతనంగా ఏర్పడిన అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సోమవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో గురించి ఆరా తీశారు. టీయూడబ్ల్యూజేఐజేయు సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి , ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్ లు జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బండారు యాదగిరి మాట్లాడుతూ... అర్హులందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో చాలా సంవత్సరాలుగా అర్హులైన వారు జర్నలిస్టులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణంతో పాటు నియోజకవర్గ కేంద్రాలలో , మండలాల్లో అర్హులు చాలామంది ఉన్నారని చెప్పారు.వీరందరికీ కూడా సకాలంలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేస్తే బాగుంటుందని వివరించారు. జిల్లాలో ప్రింట్ మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాలో , ఉర్దూ , ఇంగ్లీష్ పత్రికలలో అనేకమంది నిత్యం వార్తలు రాస్తున్నారని చెప్పారు. ఇటీవల కాలంలో స్థానికంగా కూడా కొత్త పత్రికలను ఏర్పాటు చేశారని చెప్పారు. కేబుల్ టీవీలలో కూడా అనేక వార్తలు ప్రసారం అవుతున్నాయని అన్నారు. వీడియో గ్రాఫర్లు ఫోటోగ్రాఫర్లుగా చాలామంది వృత్తికి అంకితమై పని చేస్తున్నారని వివరించారు. జర్నలిజమే ప్రధాన వృత్తిగా స్వీకరించి అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం జర్నలిస్టులంతా దరఖాస్తులు చేసుకుంటున్నారని అన్నారు. వారందరికీ కూడా ప్రభుత్వం తరఫున లభించే గుర్తింపు కార్డుగా అక్రిడిటేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎంతమంది దరఖాస్తు చేశారు ?ఇంకా ఎంత మంది దరఖాస్తు చేసే అవకాశం ఉన్నది ?అని అడిగారు. జర్నలిజం కోసం అంకితమై పనిచేస్తున్న వారి పేర్లను ప్రతిపాదిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా ఆమె సూచించారు. సంగారెడ్డి జిల్లా యూనియన్ తరపున తనను ప్రతిపాదించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే ఫైసల్ లకు బండారు యాదగిరి కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కుల కోసం సంక్షేమం కోసం తమ సంఘం నిరంతరం పాటుపడుతుందని ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. డిపిఆర్ఓ విజయలక్ష్మి తో పాటు సభ్యులుగా నియమితులైన యోగానంద రెడ్డి, శ్రీధర్, వై ప్రభాకర్, జి ప్రభాకర్, ఆరిఫ్, అక్రముద్దీన్, మురారి, సిద్ధిక్ అహ్మద్ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు తొలి ప్రాధాన్యత

- జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య
- ప్రజావాణికి 63 వినతుల స్వీకరణ



**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన మొత్తం 63 దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యలు, వినతులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా నలుమూలాల నుండి ప్రజలు నమ్మకంతో తమ సమస్యలను ప్రజావాణి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారని, వాటి పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. సంక్షేమం, రెవిన్యూ, వ్యవసాయం, గృహనిర్మాణం, మార్కెటింగ్, ఎంప్లాయ్మెంట్ తదితర శాఖలకు సంబంధించిన వినతులను అధికారులు ప్రత్యేక దృష్టితో తీసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం చూపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**వెల్దండ, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ దేయమని, దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం వెల్దండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పొల్యూషన్ కమిటీ సభ్యుడు బాలాజీ సింగ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కేటాయిస్తున్న క్వింటాల్ ధర రూ.2400 రూపాయలు ,రైతులందరూ సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మడం ద్వారా మధ్యలో దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని సూచించారు. రైతులను రాజులను చేయాలని సంకల్పంతోనే ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భీష్మ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, శ్రీనివాసులు, శోభారాణి, మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్ కుమార్ యాదవ్, సర్పంచ్లు మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, రవీందర్ నాయక్, గన్య నాయక్, డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భూపతి రెడ్డి, డిసిసి కార్యదర్శి మోతిలాల్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు హరి కిషన్ నాయక్, ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్, నాయకులు కేసముల్ల కృష్ణ, కిష్టాల్, ముదిగొండ రమేష్, పురుషోత్తం చారి, లచ్చిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణలో కార్మికులు కీలకపాత్ర పోషించాలి

- రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న పాలకులు
- హక్కులకు భంగం కలిగిస్తే పోరాటం చేయాలి
- దేశసార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలి
- ప్రాథమిక హక్కులను రక్షించుకోవాలి
- సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబ



**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** రాజ్యాంగ పరిరక్షణలో కార్మికులు కీలకపాత్ర పోషించాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబ అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్లో సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ-సవాళ్లు అనే అంశంపై సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్కు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సాయిబాబ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజల హక్కుల రక్షణ కోసం రూపొందించబడిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో దేశానికి స్వాతంత్ర్య కావాలని నినదించడమే కాకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. దేశ సార్వభౌమత్వ-లౌకిక వాద-ప్రజాస్వామ్య భారతదేశంగా అవతరించిందని తెలిపారు. భారతదేశంలో విభిన్న జాతులు, మతాలు, కులాలు ఉండడంతో లౌకికవాద పరిరక్షణకు దోహదం చేస్తూ భారత రాజ్యాంగాన్ని తయారు చేశారని వివరించారు. భారతరాజ్యాంగాన్ని డా. బీఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలో రూపొందించి ప్రజలకు ప్రజాస్వామ్య, స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర హక్కులను కల్పిస్తూ వివిధ ఆర్టికల్స్ను కల్పిస్తూ ప్రజల కోసం రాజ్యాంగాన్ని తయారు చేశారని వివరించారు. కానీ నేడు భారత రాజ్యాంగానికి పాలకులు తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ ద్వారా అందరికి ఆర్థిక సమానత్వం కల్పించిందని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబ తెలిపారు. ఈ ఆర్థిక స్వేచ్ఛతో ఎవరికి వారు తమకు ఇష్టమైన వస్తువులు, ఇష్టమైన ప్రాంతంలో కొనుగోలు చేయవచ్చన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం అందరికి అందాల్సిన ఆర్థిక సమానత్వానికి బదులుగాఊ కార్పోరేట్లకు దేశ సంపదను కొల్లగొడుగుతుందని విమర్శించారు. అంతే కాకుండా దేశ ప్రధాన మంత్రి సామ్రాజ్యవాదానికి అడుగులకు మడుగులొత్తుతూ దేశాన్ని ఇతర దేశాలకు తాకట్టుపెడుతున్నారని ఆరోపించారు. భారత దేశం సార్వభౌమాదికార దేశం అలాంటి దేశాన్ని అమెరికాకు తాకట్టుపెడుతూ వారు చెప్పినట్లుగా పనిచేస్తూ దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారన్నారు. ఆర్టికల్ 21 ప్రకారం దేశంలో జీవించే హక్కు కల్పించబడిందని కానీ దేశంలో వ్యవసాయం చెప్పనట్లుగా పనిచేస్తూ దేశ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారన్నారు. ఆర్టికల్ 21 ప్రకారం దేశంలో జీవించే హక్కు కల్పించబడిందని కానీ దేశంలో వ్యవసాయం చేస్తూ అందరికి తిండిపెడుతున్న రైతన్న మాత్రం ఆకలి చావులకు గురవుతున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్స్ రక్షించుకునేందుకు కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, కార్యదర్శి జి.సాయిలు, కోశాధికారి కె.రాజయ్య, సీఐటీయూ ఉపాధ్యక్షులు మానిక్యం, ప్రవీన్ కుమార్, బాగారెడ్డి, యాదగిరి, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## కాకిజనవాడలో పంచాయతీ నిధులతో సీసీ కెమెరాల ఏర్పాటు



**న్యాల్‌కల్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** మండలంలోని కాకిజనవాడ గ్రామంలో సోమవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. 2025 - 26 ఆర్థిక సంవత్సరం గ్రామ పంచాయతీ నిధులతో గ్రామ సర్పంచ్ లక్ష్మారెడ్డితో కలసి స్థానిక సీఐ, ఎస్ఐలు సీసీ కెమెరాలను ప్రారంభించారు. స్థానిక యువత, తదితరుల చొరవతో గ్రామంలోని పలుచోట్ల 8 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని సాధన కూడలేలు, జనసంచార ప్రదేశాలు, వ్యాపార సమూహాల ప్రదేశాలు, తదితర స్థలాల్లో ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్, తదితరులు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన అధికార, విపక్ష పార్టీ శ్రేణులు, యువకులు పాల్గొన్నారు.

# కాటారంలో న్యాయం కోసం ధర్నా

- గంటపాటు ట్రాఫిక్ స్థంభనం
- ఆదివాసీ సంఘాల నిరసన ధర్నా



**కాటారం, ఏప్రిల్ 13 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రం సోమవారం అంబేద్కర్ చౌక్ లో ఉద్రిక్తత నెలకొంది. మహాదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన యువకుడు గత నెలలో జెన్కో పంప్ హౌస్ సమీపంలో అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై ఇప్పటికీ సరైన దర్యాప్తు జరపకపోవడంపై ఆగ్రహంతో 'తుడుం దెబ్బ' ఆదివాసి సంఘం నాయకులు రోడ్డెక్కారు. గారేపల్లి అంబేద్కర్ కూడలి వద్ద నిర్వహించిన ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో ఆదివాసులు పాల్గొని పోలీసుల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు నమోదై రెండు నెలలు గడిచినా ఒక్క అడుగు ముందుకు పడకపోవడం పోలీస్ శాఖ పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది అని నిరసనకారులు మండిపడ్డారు. ధర్నా కారణంగా సుమారు గంటపాటు రాకపోకలు పూర్తిగా స్థంభించిపోయాయి. వందలాది వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమర్థంగా నియంత్రించలేకపోయారని ప్రత్యక్ష సాక్షులు విమర్శించారు. ఎస్సై శ్రీనివాస్ ఒక్కరే పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు శ్రమిస్తుండగా, మిగతా సిబ్బంది నిర్వీర్యంగా నిలబడి ఉండటం తీవ్ర చర్చనీయాంశమైంది. కొంతమంది సిబ్బంది సెల్‌ఫోన్లలో మునిగిపోయి బాధ్యతలను విస్మరించారని ఆరోపణలు వినిపించాయి. "ఎస్సై ఉన్నాడులే... మాకేం పని" అన్నట్టుగా వ్యవహరించారని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ పోలీస్ శాఖ సమన్వయం లోపం స్పష్టంగా బయటపడిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాటారం సబ్ డివిజన్‌లో పోలీసింగ్ ఉందా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజల ఆగ్రహాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి, యువకుడి మృతి కేసులో పారదర్శక దర్యాప్తు చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

# ఎండల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రోజు రోజుకు పెరుగుతున్న ఎండల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండల బారి నుండి రక్షణపై సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ మన జిల్లాకు ఆరెంజ్ జోన్ ప్రకటించినట్లు తెలిపారు. వేసవిలో ప్రజలు ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నాయని, ఎండ దెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్య రక్షణ చర్యలు పాటించాలని స్పష్టం చేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాల్లో ప్రజలు ఇంటి నుండి బయటకు వెళ్లకుండా ఉండాలని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల మధ్య ఎండ అధికంగా ఉంటుందని ప్రజలు బయటికి వెళ్లొద్దని తెలిపారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడ దెబ్బబారిన పడే అవకశాలున్నాయని, తద్వారా అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వడదెబ్బకు గురైతే ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎండల్లో చిన్నారులు, వయోవృద్ధులతో ప్రయాణం చేయొద్దని ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇంటి నుండి బయటికి వస్తే తలకు ఎండ తగలకుండా గొడుగు, కండువా, టోపితో కవరు చేసుకోవాలన్నారు. తరచుగా మంచినీళ్లు త్రాగాలని సూచించారు. మజ్జిగ, నిమ్మరసం, ఉప్పు పంచదార కలిపిన ద్రావణం, ఓఆరెస్ తీసుకోవాలని తెలిపారు. వదులుగా ఉన్న కాటన్ దుస్తువులు ధరించాలని తెలిపారు. ఎండల వల్ల చర్మంపై ఎర్రటి దద్దుర్లు, పొడిబారడం లాంటి మార్పులను గమనించాలని తెలిపారు. వేడి వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని, అలసట, నోరు ఎండి పోవడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయక తక్షణమే సమీప ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్య సేవలు పొందాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు 108 కు ఫోన్ చేయాలని అన్నారు. నిల్వ ఉన్న ఆహారం, వేపుళ్లు, ఆరు బయట ఆహార పదార్థాలుకు దూరంగా ఉండటం మంచిదని సూచించారు. ఉపాధి హామీ పథకం పనులు కూలీలు ఉదయం 6 నుండి 11, సాయంత్రం 4 నుండి 6 గంటలు వరకు పనులు చేయించాలని, పనులు జరుతున్న ప్రదేశాల్లో రక్షణ, జాగ్రత్తలు పాటించేలా షేడ్ నెట్స్, ఓఅర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా మధుసూదన్, ప్రోగ్రాం అధికారి డా దేవేందర్, ఆర్డిఓ హరికృష్ణ, డిఆర్డీఓ బాలకృష్ణ పాల్గొన్నారు. రహదారి నియమాలు పాటిస్తూ వాహనదారులు బాధ్యతతో వాహనాలు నడిపితే రహదారి ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ రాజ్, వైద్య, శాఖల అధికారులతో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం, అధిక వేగాన్ని నియంత్రించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం వంటి చర్యలు ప్రమాదాల తగ్గింపుకు కీలకమని తెలిపారు. ముఖ్యంగా యువత రహదారి నియమాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఎస్పీ నరేష్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, ఆర్టిఓ సంధాని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, ఆర్డీఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

# ఇంటర్ స్టూడెంట్‌కు కలెక్టర్ అభినందన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్ సాధించిన నరాల అంజలిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిట్యాల మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచడం మన జిల్లాకు గర్వకారణమని, మన జిల్లా ఖ్యాతిని రాష్ట్ర వ్యాప్తం చేశారని పేర్కొన్నారు. అంజలి సాధించిన ఈ విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపిసి గ్రూపులో 418 మార్కులు సాధించిన ప్రణితను, 456 మార్కులు సాధించిన భరణి లోకేష్‌ను కూడా కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధనకు ఉత్తమ విద్యా బోధన చేసిన అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఇంగ్లీష్, జువాలజీ అధ్యాపకులు రమేష్, జి. రమేష్ పాల్గొన్నారు.

### ప్రశాంతంగా పది పరీక్షలు: కలెక్టర్..

10వ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగియడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన జడ్పిఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న పరీక్షా కేంద్రంలో మొత్తం 201 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, డిపార్ట్మెంటల్ అధికారి లక్ష్మి పాల్గొన్నారు.

# యోగా జీవన సమతుల్యతను సాధించే మార్గం

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** యోగ శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించే మార్గమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. ప్రజాపాలన–పురోగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో యోగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా యోగాసనాలు చేసి పాల్గొన్న వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగ మన భారతీయ సంస్కృతిలో ఒక ముఖ్యమైన భాగమని, ఇది వేల సంవత్సరాల చరిత్ర కలిగిన జీవన విధానమని తెలిపారు. నేడు యోగ ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, అన్ని దేశాల్లో ప్రజలు దీనిని ఆచరిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. యోగ కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాకుండా, మనసు, ఆలోచనలు, జీవనశైలిని సానుకూల దిశగా మలిచే శక్తివంతమైన సాధనమని కలెక్టర్ అన్నారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళనలు తగ్గి, శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత లభిస్తాయని వివరించారు. ప్రస్తుత కాలంలో ఉద్యోగులు దైనందిన జీవితంలో పని ఒత్తిడితో ఆరోగ్యం పట్ల సరైన శ్రద్ధ వహించకపోవడం వల్ల వివిధ వ్యాధులు దరిచేరుతున్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగ చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక సమతుల్యత పెంపొందడంతో పాటు వ్యాధులను దూరం చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా యోగకు పెరుగుతున్న ఆదరణ మన సంస్కృతికి గర్వకారణమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ యోగను తమ దైనందిన జీవితంలో భాగంగా అవలంబించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యోగ గురువు రవీంద్ర చారి, జిల్లా పర్యాటక శాఖాధికారి శివాజీ, జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా పౌరసంబంధాల అధికారి ఆయూబ్ అలీ, డీఈ అరుణ, జిల్లా సహకార అధికారి, సంజీవరెడ్డి, డిఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, తదితర శాఖల అధికారులు, సిబ్బంది యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

# ప్రాచీన ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**బోథ్, ఏప్రిల్ 13(జనంసాక్షి) :** ప్రాచీన ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక శివ భక్తి మార్కండేయ నూతన ఆలయ నిర్మాణానికి భూమి చేసి పనులు ప్రారంభించారు. అనంతరం నిగిని గ్రామానికి చెందిన రైతుల పంటపొలాల్లో విద్యుత్ మంటలు చెలరేగి మొక్క జొన్న పంట పూర్తిగా దగ్ధం అయింది. తక్షణమే బాధితులకు 10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ, విజయ లక్ష్మీ, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ శ్రీధర్ రెడ్డి, స్వామి, రవీందర్, అంబాజీ, సురేందర్ యాదవ్, ప్రశాంత్ తదితరలు పాల్గొన్నారు.

### నిర్మల్ వాసులు చిత్రసీమలో అడుగుపెట్టడం పెట్టడం అభినందనీయం



**నిర్మల్ రూరల్, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా అంటేనే చరిత్రాత్మక ప్రాంతమని, చలన చిత్రాల షూటింగ్ కి అనువైన ప్రాంతమని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు సోమవారం. కొప్పుల క్రియేషన్స్ ఆధ్వర్యంలో ద ఎంప్టీ సీట్ చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిర్మల్ పట్టణం నుండి చలన చిత్ర నిర్మాతలు, దర్శకులుగా ఎదగడం హర్షనియమన్నారు. మొట్టమొదటి సారిగా దర్శకులు, నిర్మాతలుగా అడుగుబెడుతున్న ద్యాగ స్వామి, కొప్పుల చిన్నయ్యలను అభినందించారు

# 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలి

- ప్రజా ప్రతినిధుల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలి
- జిల్లాలో టీబీ నివారణ కోసం ప్రత్యేక కార్యచరణ అమలు
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ బ్యూరో, ఏప్రిల్ 13(జనం సాక్షి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం కింద ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు నిర్వహించనున్న కార్యక్రమాల అమలుకు సంబంధించి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్షయవ్యాధి (టీబీ) కేసులను గుర్తించడం, వారికి తక్షణ చికిత్స అందించడం, అలాగే డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణ నియంత్రణకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు తెలియజేయాలని, ఆరోగ్య శానిటేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 23 నుండి ఎడ్యుకేషనల కేంద్రాలు వేసవి సెలవుల దృష్ట్యా ఆ కేంద్రాల లోని వాటర్ ట్యాంక్ లను ఖాళీ చేసి కడిగి ఎండ పెట్టాలని సూచించారు. అలాగే వేసవి తీవ్రత దృష్ట్యా హీట్ స్ట్రోక్ కేసులను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని, మహబూబాబాద్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి (జిల్లా హాస్పిటల్)లో ప్రత్యేక హీట్ స్ట్రోక్ వార్డులను ఏర్పాటు చేసి అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలో ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ గారు సూచించారు. గ్రామ పంచాయతీ, వార్డుల వారిగా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఐకెపి, సిబ్బంది అన్ని వర్గాల వారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, రోడ్డు భద్రత, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ నివారణ, హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై నిర్వహించే కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. నూతనంగా గ్రామ స్థాయిలో హెల్త్ శానిటేషన్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని, దోమల నివారణ నిల్వ ఉన్న నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ఫ్లెక్సీలు, పోస్టర్స్ కరపత్రాలు ముద్రించి పట్టణాలు, గ్రామాలలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టే ప్రతీ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను ప్రజలకు ముందస్తు సమాచారం అందించి కార్యక్రమాల విజయవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సమస్యలు అధికంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, ఆర్డీఓలు కృష్ణవేణి, గణేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్, సీఈఓ పురుషోత్తం, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, డిప్యూటీ డెమో ప్రసాద్, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు చేరిన సన్నాల బోనస్

- జనంసాక్షి పత్రిక కథనానికి స్పందన


## సన్నవడ్ల బోనస్ డబ్బులు ఇవ్వాలి
రైతుల ఆందోళన

మల్హర్, (జనంసాక్షి): భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండలం లోని రైతులు ఖరీఫ్‌లో పండించిన సన్న వడ్లు కు సంబంధించిన బోనస్ డబ్బులు ఇంత వరకు రైతుల ఖాతాలలో జమ కాలేదు. తాడిచర్ల, మల్లారం, పెద్దతూండ్ల, శత్రాజ్ పల్లి అన్ని గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. కాటం మధుకర్ రెడ్డి, కాటం సంజీవ్ రెడ్డి రైతులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అకౌంట్ ఉండగా సన్న వడ్ల బోనస్ డబ్బులు పడలేదు. అన్ని బ్యాంకు లలో బోనస్ డబ్బులు పడినాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఎందుకు సన్న వడ్ల బోనస్ డబ్బులు రావటం లేదో రైతులకు అర్థం కావటం లేదు. సన్న వడ్ల బోనస్ డబ్బులు ఇంత వరకు జమ కాకపోవడంతో మండలం లోని రైతు లందరు ఆవేదన చెందు తున్నారు. ఇప్పటికైనా ఉన్నతధికారులు స్పందించి సన్న వడ్ల బోనస్ డబ్బులు జమ చెయ్యాలి అని రైతులు అన్నారు.

జనంసాక్షి
07 Apr 2026 - Page 3
https://epaper.janamsakshi.org/clip/474071

**మల్హర్, ఏప్రిల్ 13(జనంసాక్షి) :** తెలంగాణలోని సన్న వడ్లు పండించిన రైతులకు ఎట్టకేలకు బోనస్ కష్టాలు తీరాయి. గత కొద్ది రోజులుగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఖాతాదారులైన రైతులకు బోనస్ నగదు జమ కాకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా, సాంకేతిక కారణాల వల్ల డబ్బులు అందక రైతులు సతమతమయ్యారు. ఈ సమస్యపై జనంసాక్షి దినపత్రిక కథనాన్ని ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ వార్తా కథనానికి జిల్లా అధికారులు సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న బోనస్ నగదును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకున్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన జనంసాక్షి పత్రికకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎట్టకేలకు రైతుల ఖాతాల్లో నగదు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**చిట్యాల, ఏప్రిల్ 13( జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్ళల్లో ఆనందం కనిపిస్తుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామములో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న తుమ్మ తిరుపతమ్మ - సమ్మయ్య గృహ ప్రవేశం నిర్వహించుకోగా ఎమ్మెల్యే జీఎస్సార్ ముఖ్య అతిథిగా హాజరై, ఇళ్లు ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరుతుందన్నారు. అర్హులందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎమ్మార్వో వసంతరావు, సిరిపురం కుమారస్వామి, గూట్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# జియో కో-ఆర్డినేషన్‌లో పొరపాట్లు జరగొద్దు

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు బ్యూరో, ఏప్రిల్13(జనం సాక్షి):** రామచంద్రపురం భూముల సర్వేలో ఏర్పాటు చేసే జియో కోఆర్డినేషన్ లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మల్లంపల్లి మండలం రామచంద్రపురం గ్రామ శివారు లోని రాజేశ్వరరావు పల్లె లో జరుగుతున్న సర్వేను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వే జరుగుతున్న తీరును, డేటా ఎంట్రీ, జియో కోఆర్డినేషన్ ఏర్పాటు పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రామ చంద్రపురం భూముల సర్వే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తుందని జియో కోఆర్డినేషన్ ఏర్పాటు లో, సర్వే నిర్వహించడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, తహసిల్దార్ విజయభాస్కర్ సంబధిత అధికారులు పాల్గొన్నారు.

### కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా మోహన్ శర్మ

**కాళేశ్వరం , ఏప్రిల్ 14 , ( జనం సాక్షి).** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం ఆలయంలోని మండపంలో నిర్వహించారు . ఆలయ చైర్మన్ గా అవధాని మోహన్ శర్మ , ధర్మకర్తలు గా దొడ్ల అశోక్ , కుంభం పద్మ , అడ్డూరి శ్రీధర్ రావు , మంచినీళ్ల దుర్గయ్య , గందెసిరి సత్యనారాయణ , సుంకరి సీతయ్య, జలవంచ సీతారాం , కాటం సత్తయ్య , శ్యామ్ సదర్ దేవుడా ప్రమాణ స్వీకారం చేశారు. ఎక్స్ అఫీషియో మెంబెర్ గా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఫణకంటి ఫణీంద్ర శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్. మహేష్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు.



## రోడ్డు భద్రత వారోత్సవాలలో పాల్గొన్న కొత్తగూడెం మేయర్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన "ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక"( 99 రోజుల యాక్షన్ ప్లాన్) కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం లో మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని తద్వార ప్రమాదాలను తగ్గించడం, మరియు ప్రాణాలను రక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం మరియు మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి అంశాలు ప్రజలకు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో 1వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కరుణాకర్,3వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఇంద్ర సేన రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ గడ్డం ప్రవీణ్ కుమార్, కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు, ప్రజలు తదితరులు పాల్గొన్నరు.

## పశువుల ఆసుపత్రి ముందే మురుగు ప్రవాహం

- పట్టించుకోని పాలకులు, అధికారులు



**మాడుగులపల్లి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** మండల పరిధిలోని పాములపాడు గ్రామంలో సమస్యలు తిష్టవేసి కూర్చున్నాయి. ముఖ్యంగా గ్రామస్తులు, పశుపోషకులు నిత్యం వెళ్లే ప్రభుత్వ పశువైద్యశాల ముందే మురుగునీరు నిలిచి ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సిసి రోడ్డుపై మురుగునీరు పారుతుండటంతో అటుగా వెళ్లే ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు గ్రామంలోని పశువుల ఆసుపత్రికి తమ మూగజీవాలను తీసుకువెళ్లే రైతులు ఈ మురికి నీటిలోనే నడవాల్సి వస్తోంది ఆసుపత్రి గేటు ముందే మురుగునీరు నిలిచి ఉండటంతో అటు పశువులకు, ఇటు రైతులకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు ప్రభుత్వ కార్యాలయం ముందే పరిస్థితి ఇలా ఉంటే, ఇక గ్రామంలోని మిగతా వీధుల పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు అని గ్రామస్తులు విమర్శిస్తున్నారు మురుగు కాల్వల నిర్వహణ లోపం వల్లనే నీరు రోడ్లపైకి వస్తున్నప్పటికీ, పంచాయతీ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలు వస్తున్నాయి మురికి నీటి వల్ల వెదజల్లుతున్న దుర్వాసనతో ఆసుపత్రి సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, పశువుల ఆసుపత్రి ముందు పేరుకుపోయిన మురుగును తక్షణమే క్లీన్ చేయించాలని, శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పాములపాడు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## వానాకాలానికి ముందే సింగూర్ డ్యాం పనులు పూర్తి చేయాలి



- పనుల్లో రాజీ లేదు గడువులోపు పూర్తి చేయాలి
- వచ్చే యాభై ఏళ్ళు గుర్తుండేలా డ్యాం నిర్మాణ పనులు చేపట్టాలి
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**పుల్కల్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** వానాకాలం ప్రారంభమయ్యేలోపు సింగూర్ డ్యాం మరమ్మత్తులు పూర్తి చేయాలని, నీటి నిల్వకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను మంత్రి పరిశీలించారు.అలాగే సింగూరు ప్రధాన కాలువైన సిలారపు దామోదర్ రాజనర్సింహ సీసీ లైనింగ్ పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులను హెచ్చరించారు. వచ్చే యాభై ఏళ్లు గుర్తుండేలా డ్యామ్ సేఫ్టీ పనులు చేపట్టాలన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారులు సూచించిన మేరకు నిర్మాణ పనులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. సింగూరు ప్రాజెక్టులో చేపట్టబోతున్న ఐలాండ్ పనుల అభివృద్ధిపై టూరిజం అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం మండలంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రధాన కాలువను పరిశీలించిన అనంతరం మంత్రి పక్కనే ఉన్న సింగూరు గురుకుల పాఠశాల ను పరిశీలించి విద్యార్థుల సమస్యలు వారితో మాట్లాడి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాల, స్పోర్ట్స్ ఫెసిలిటీస్ కల్పనకు అవసరమైన ప్రతిపాదన రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఇరిగేషన్ శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుర్గారెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, మల్లారెడ్డి, బోయిని శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి,యూత్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు ముందుకు రావాలి
- ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుంది
- నేరాల నివారణలో ప్రజలు భాగస్వామి కావాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్ నందు 75 సీసీ కెమెరాలు అనుసంధానంతో ఏర్పాటుచేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ జిల్లా ఎస్పీ నరసింహ సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట డిఎస్పి, ఆర్డీవో, టౌన్ సీఐతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నివారణ, నేరాల నియంత్రణ, నేరాల చేదనలో సీసీ కెమెరాలు ప్రాధాన్యత చాలా ఉందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు వ్యాపారస్తులు ముందుకు రావాలని అన్నారు.నేరాల నివారణలో భాగస్వామ్యం కావాలని కోరారు.అభివృద్ధిలో రోజురోజుకు పురోగతి చెందుతున్న సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజల భద్రతకు సూర్యాపేట పోలీసులు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.భద్రతా చర్యల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని నిత్యం పర్యవేక్షణ చేయటానికి పట్టణ పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.సీసీ కెమెరాల నిఘాలతో నేరాలను అరికట్టవచ్చని తెలిపారు.సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రక్షణగా నిలుస్తాయని, ఒక్కో సిసి కెమెరా 100 నేత్రాలతో వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. పట్టణంలో మరింత రక్షణ కల్పించడానికి సీసీ కెమెరాలు ఆధునికరిస్తున్నామని పేర్కొన్నారు.ఎక్కువ మొత్తంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఈ దిశగా ప్రజలకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి,టౌన్ సీఐ వెంకటయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మసిగుండ్లపల్లిలో భారీగా రేషన్ బియ్యం స్వాధీనం

- 127 భస్తాలు పట్టివేత
- బోలెరో వాహనం సీజ్



**మిడ్జిల్, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** మిడ్జిల్ మండలం మసిగుండ్లపల్లి గ్రా మంలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ స్థాయిలో రేషన్ బియ్యాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం తెల్లవారుజామున సుమారు ఉదయం 6 గంటల సమయంలో, పక్కా సమాచారం మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు గ్రామంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సుల్తాన్ ఇంట్లో అనుమానాస్పదంగా నిల్వ ఉంచిన బియ్యాన్ని పరిశీలించగా, అది ప్రభుత్వానికి చెందిన రేషన్ బియ్యం అని అధికారులు నిర్ధారించారు. వెంటనే సివిల్ సప్లయ్ శాఖ అధికారులకు మరియు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఎన్ఫోర్స్మెంట్ డీటీ వెంకటేశ్వర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మొత్తం 127 భస్తాలు (52 క్వింటాళ్లు 17 కిలోలు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్కడే నిలిపి ఉంచిన అసిఫ్ బోలెరో వాహనాన్ని సీజ్ చేసి మిడ్జిల్ పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ప్రైవేట్ వాహనాల ద్వారా జడ్చర్లలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు ఎన్ఫోర్స్మెంట్ డీటీ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై అవసరమైన కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

### రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు

ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. ప్రజలు కూడా తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ చర్యలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**తుంగతుర్తి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి పథకం ఒక వరం లాంటిదని స్థానిక శాసన సభ్యులు మందుల సామేలు అన్నారు, సోమవారం తుంగతుర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి కళ్యాణ్ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులు, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవం కల్పించాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 5 మండలాలకు సంబంధించి 265 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2,65,30,740 కోట్ల విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి ఎమ్మెల్యే సామెల్ అందజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో,తుంగతుర్తి గ్రామ సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, సింగల్ విండో మాజీ చైర్మన్ గుడిపాటి సైదులు, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఐదు మండలాల తహసిల్దార్ లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, అన్ని గ్రామాల సర్పంచులు,రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, పచ్చిపాల సుమతి,దాయం ఝాన్సీ రాజి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, వివిధ మండలాల నుండి వచ్చిన నాయకులు, విభజన సంఘాల నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల



**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** దోస్త్ ద్వారా రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం (2026-27)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది.ఏప్రిల్ 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అటానమస్ దోస్తు కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ తెలిపారు.అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది.ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరాజు గారు తెలిపారు.సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియక పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో విద్యార్థిని విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి అని తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా నల్గొండలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల( అటానమస్ ) అన్ని సౌకర్యాలతో కూడిన విద్యను అందిస్తుందని, కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, కళాశాలలో ఇన్ఫర్మేషన్ మరియు కమ్యూనికేషన్ టెక్నాలజీతో కూడిన విద్య, అదనాతనమైన లేబరేటరీలు, విశాలమైన గ్రంథాలయం, విద్యార్థినిలకు జిమ్ సౌకర్యం, ఆర్ఓతో కూడిన తాగునీటి సౌకర్యం మరియు అనేక సౌకర్యాలు ఉన్నందున ఈ కళాశాలలో చేరి తమ అభ్యున్నతికి బంగారు బాటలు వేసుకోవాలని కళాశాల దోస్త్ ఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారామ్ తెలిపారు.

## ఎరైవ్ ఏలైవ్ నినాదంతో భువనగిరిలో రోడ్డు భద్రత సదస్సు



**భువనగిరి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా భువనగిరి పట్టణం 35వ వార్డు ఆర్బి నగర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. వినాయకుని మండపం, అంజిరెడ్డి కార్ఖానా వద్ద జరిగిన ఈ కార్యక్రమం 'ఎరైవ్ ఏలైవ్'" నినాదంతో ప్రజల్లో చైతన్యం కలిగించింది. ఈ సదస్సుకు అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ (జేసీ) భాస్కర్ రావు, యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, డీఎస్పీ రవీందర్ యాదవ్, పట్టణ సీఐ రమేష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చుతు న్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత రోడ్డు భద్రతపై పూర్తి అవగాహనతో ఉండాలని, ప్రాణాల విలువను గుర్తించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ తంగాళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలంతా నియమాలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ డిఇ కొండలరావు, పిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్, రాష్ట్ర పీసీసీ కార్యదర్శి పోత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ చైర్మన్ బర్రె జాంగిర్ పాల్గొన్నారు.

# తాలు పేరుతో దిగుమతి కానీ లారీలు

- ఆందోళనలో అన్నదాతలు..
- చేసేది లేక తూర్పార పడుతున్న రైతులు



కనగల్లు, ఏప్రిల్ 13 (జనం సాక్షి) : యాసంగి కోతలు మొదలై కొనుగోలు కేంద్రాల లో ధాన్యం రాశులు కుప్పలు కుప్పలుగా దర్శనం ఇవ్వడంతో అధికారులు వెంటనే చర్యలు చేపట్టి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ సంబంధిత ఏ ఈ ఓ లు కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం రాశులను మ్యాచర్ చూడడం అలాగే రాశులలో కనిపిస్తున్న తాలు ఉందని రైతులకు తేల్చి చెప్పడంతో ఆందోళన చెంది లేక తూర్పార పడుతున్నారు. జి ఎడవెల్లి, కురంపల్లి, అమ్మగూడెం, ఎం గౌరారం, పర్వతగిరి గ్రామాలతో పాటు మరికొన్ని సెంటర్ల నుంచి మండలంలోని కురంపల్లి మహావీర్ రైస్ మిల్లు, పర్వతగిరి సాయి శ్రీనివాస రైస్ మిల్లుతోపాటు హాలియా, మల్లె పెల్లి లో ఉన్న కొన్ని రైస్ మిల్లులకు గత మూడు రోజుల నుంచి తూకం వేసిన ధాన్యాన్ని లారీలలో ఎగుమతి చేసి మిల్లర్లకు పంపిన మిల్లు యజమానులు దిగుమతి చేసుకోకుండా తాలు ఇతర కారణాలు చూపి దిగుమతిలో అలసత్వం ప్రదర్శించడం, ఐకెపి నిర్వాహకులు అక్కడికి వెళ్లి మిల్లర్ల యాజమాన్యంతో సంప్రదించిన ఫలితం లేకపోవడంతో వారు చేసేది లేక తిరుగు ప్రయాణమై ఎక్కడ జరిగిన పరిస్థితులను రైతులకు వివరిస్తున్నారు.

### కటింగ్ ఇస్తేనే దిగుమతి చేస్తాం..

తాలు ఎక్కువగా ఉంది లారీపై బస్తాకు మూడు కిలోల చొప్పున కటింగ్ ఇస్తేనే దిగుమతి చేస్తాం లేదంటే మీ లారీలను మీరు తీసుకెళ్లండి అని కఠినత్వంతో వ్యవహరించడంతో నిర్వాహకులు మిల్లర్ల దగ్గర గంటల తరబడి నిరీక్షణ చేయాల్సిన పరిస్థితి ఉండడంతో చేసేదిలేక మిల్లు యాజమాన్యంతో సంప్రదిస్తూ ఎలాగైనా దిగుమతి చేసుకోవాలని ప్రా దేయ పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం దిగుమతి చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తెలిపారు. కేంద్రాల నుంచి తూకం వేసి మిల్లు వద్దకు వచ్చిన లారీలను ఎలాంటి షరతులు లేకుండా దిగుమతి చేసుకోవాలని లేదంటే బిఆర్ఎస్ పార్టీ పక్షాన ధర్నాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని పర్వతగిరి దగ్గర ఉన్న శ్రీ శివ సాయి రైస్ మిల్ లు సందర్శించారు. గత మూడు రోజుల నుంచి వస్తున్న లారీలను ఎందుకు దిగుమతి చేసుకుంట లేవని మిల్లు యజమానితో చర్చించగా ప్రతి లారీ లో 8 శాతం తాలు ఉందని మాకు 3(మూడు )శాతం మేరనే తాలువున్న దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయని భూపాల్ రెడ్డితో అన్నారు. ఏది ఏమైనా వచ్చిన దాన్యం తిరిగి తీసుకువెళ్లడం కుదరదని ఎలాగైనా దిగుమతి చేసుకోవాలని దీనిపై మిల్లు యాజమాన్యం స్పందించి రైతులకు సహకరించాలని కోరారు. మిల్లు వద్ద నుంచి సంబంధిత కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సివిల్ సప్లై అధికారులతో మిల్లు వద్ద జరుగుతున్న విషయాలను ఫోన్లో మాట్లాడారు.

# ప్రభుత్వ ఉద్యోగమని ఘరానా మోసం

- నకిలీ ఎఫ్‌సీఐ అధికారి అని పెళ్లి ముసుగులో దారుణం
- చెర్లపల్లి మేనేజర్‌నంటూ కలరింగ్ అడ్డంగా బుక్కైన చెరువుపల్లి కిలాడీ
- నకిలీ ఐడీ కార్డులు, కారు స్వాధీనం రిమాండ్‌కు తరలింపు

**మాడ్గులపల్లి, ఏప్రిల్ 13 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగం ఉందంటే చాలు కళ్ళు మూసుకుని కోట్లు కుమ్మరించే అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఓ కిలాడీ మోసగాడు భారీ స్కెచ్ వేశాడు ఐడీ కార్డులు, కారుకు స్టిక్కర్లు ఇలా అన్నీ నకిలీవి సృష్టించి, ఏకంగా ఒక కుటుంబం నుండి కోటిన్నర రూపాయలు నొక్కేయాలని చూసిన వైనం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చెరువుపల్లి గ్రామంలో వెలుగుచూసింది. నల్లగొండ జిల్లా చెరువుపల్లి గ్రామానికి చెందిన పనస మధు అనే వ్యక్తి, సులభంగా డబ్బు సంపాదించడమే లక్ష్యంగా మోసాలకు తెరలేపాడు. తాను చెర్లపల్లి ఎఫ్ సి ఐ (ఫుడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా )లో గ్రేడ్-3 టెక్నికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నానని నమ్మబలికాడు నమ్మకం కుదరడం కోసం నకిలీ ఐడీ కార్డులు సృష్టించడమే కాకుండా, తన కారుపై ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని స్టిక్కర్ వేయించుకుని అధికారిక హంగామా చేశాడు ఈ క్రమంలో ఓ యువతి కుటుంబంతో పెళ్లి సంబంధం కుదుర్చుకున్నాడు

తమ అల్లుడు పెద్ద ఆఫీసర్ అని నమ్మిన బాధితుడి కుటుంబం నిందితుడు అడిగిన రూ. 2 కోట్ల వరకట్నంపై బేరసారాలు ఆడింది చివరకు రూ. 1.50 కోట్లకు ఒప్పందం కుదరగా, నిశ్చితార్థం కూడా అట్టహాసంగా ముగిసింది అయితే, పెళ్లికి ముందే తనలోని రాక్షసత్వాన్ని బయటపెట్టిన నిందితుడు ప్రీ-వెడ్డింగ్ షూట్ పేరుతో బాధితురాలిని పిలిపించుకుని వేధించడం మొదలుపెట్టాడు. నిందితుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాధితురాలు, లోతుగా ఆరా తీయగా అసలు విషయం బయటపడిందిఎఫ్ సి ఐ లో ఆ పేరుతో ఎవరూ లేరని, అతను చూపిస్తున్నవన్నీ నకిలీ ఐడీ కార్డులని తేలిపోయింది దీంతో లబోదిబోమంటూ బాధితురాలు చైతన్యపురి పోలీసులను ఆశ్రయించింది కేసు నమోదు చేసిన పోలీసులు మధును అదుపులోకి తీసుకున్నారు అతని వద్ద నుండి రెండు నకిలీ ఐడీ




కార్డులు, కారు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు మాట్రిమోనియల్ సైట్లు లేదా బయట సంబంధాల విషయంలో కేవలం ఐడీ కార్డులను చూసి నమ్మవద్దని, సదరు వ్యక్తి ఉద్యోగం చేస్తున్న ఆఫీసుకు వెళ్లి విచారించాలని పోలీసులు సూచిస్తున్నారు ప్రభుత్వ ఉద్యోగం పేరుతో ఇలాంటి మాయగాళు ఎందరో తిరుగుతుంటారని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.ఈ విషయం ఈరోజు మాడుగుల పల్లి మండలంలో చర్చనీయంగా మారింది గత కొన్ని రోజుల క్రితం హైదరాబాదులో జరిగినట్టుగా తెలుస్తుంది.




## నష్టాలతో ముగిసిన సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇరాన్–అమెరికా మధ్య చర్చలు విఫలం కావడం, హర్మూజ్ దిగ్బంధనానికి ట్రంప్ ఆదేశాలు ఇవ్వడం వంటి కారణాలతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీనికితోడు చమురు ధరలు పెరగడమూ ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో పీఎస్‌యూ బ్యాంక్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అయితే, సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లు నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుని 700 పాయింట్ల నష్టానికే పరిమితం కావడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 75,937.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,550.25) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,868.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 702.57 పాయింట్ల నష్టంతో 76,847.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 207.95 పాయింట్ల నష్టంతో 23,842.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలహీనపడి 93.39గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 102 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4717 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణాలు ఇవే..**

అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలం కావడంతో హర్మూజ్‌ను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ పరిణామాలు సెంటిమెంట్ దెబ్బతీశాయి. ఇటీవల కాస్త తగ్గిన చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు ఏడు శాతం పెరిగి 102 డాలర్లకు చేరింది.

## డిజిటల్ చెల్లింపుల రారాజు.. 'యూపీఐ'

### గత నెలలో లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్లకు..




అంతర్జాతీయ రియల్–టైమ్ చెల్లింపుల్లో 49% వాటా రైతుబజారుకు వెళ్లి కూరగాయలు కొన్నా, కిరాణా దుకాణానికి వెళ్లి సరుకులు తీసుకున్నా.. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)తో చెల్లింపులు చేయడం మనదేశంలో సర్వసాధారణంగా మారింది. చిన్న బడ్డీ కొట్టు నుంచి పెద్ద షాపింగ్ మాల్స్ వరకు చెల్లింపుల్లో యూపీఐ హవా కొనసాగుతోంది. ప్రజలకు చిల్లర సమస్య తీరిపోయింది. నగదు కోసం ఏటీఎంల వద్ద వరుసల్లో నిలబడటం కనుమరుగైంది. 2016 ఏప్రిల్ 11న యూపీఐ సేవలను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. గత నెలలో యూపీఐ లావాదేవీల విలువ రూ.30 లక్షల కోట్లకు చేరింది. గత పదేళ్లలో, ప్రజల రోజువారీ జీవితంలో యూపీఐ చెల్లింపులు ఒక భాగంగా మారడాన్ని ఇది సూచిస్తోంది. డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. వర్చువల్ పేమెంట్ అడ్రస్ (వీపీఏ) ద్వారా బ్యాంక్ ఖాతాలను లింక్ చేయడంతో, లావాదేవీలు చాలా సులభంగా మారాయి. ఎవరికైనా నగదు పంపాలన్నా, వారి బ్యాంక్ ఖాతా సంఖ్య, ఐఎఫ్ఎస్సీ కోడ్ అవసరం లేకుండా పోయింది. ఒక వ్యక్తి మొబైల్ నంబరు/యూపీఐ ఐడీ ఉంటే, సురక్షిత ధ్రువీకరణ (సెక్యూర్ అథెంటికేషన్) వినియోగించి నగదు పంపొచ్చు లేదా స్వీకరించొచ్చు. రోజులో ఏ సమయంలో అయినా, రియల్ టైమ్‌లో ఆటంకాలు లేకుండా, నగదు పంపే వెసులుబాటు ఉండటంతో ఎక్కువ మంది యూపీఐ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. నగదుపై ఆధారపడటాన్ని యూపీఐ తగ్గించింది. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, అసంఘటిత కార్మికులు, గ్రామీణ వినియోగదార్లు కూడా డిజిటల్ ఆర్థిక వ్యవస్థలోకి అడుగుపెట్టేందుకు ఇదే కారణం. మన దేశంలో 2021లో 216 బ్యాంకులు యూపీఐ సదుపాయం కల్పిస్తుండగా, 2026 జనవరికి వీటి సంఖ్య 691కి చేరింది. సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, భూటాన్, నేపాల్, మారిషస్, శ్రీలంక, ఖతార్, ఇజ్రాయెల్ దేశాల్లోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి. లావాదేవీల సంఖ్య, ప్రాసెసింగ్ పరంగా రియల్–టైమ్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే యూపీఐ అగ్ర స్థానంలో ఉంది. మన దేశంలో రిటెయిల్ డిజిటల్ లావాదేవీల్లో యూపీఐ వాటా 81%. అంతర్జాతీయంగా రియల్–టైమ్ చెల్లింపుల లావాదేవీల్లో 49% వాటా యూపీఐదే. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) కూడా, ప్రపంచ రియల్–టైమ్ చెల్లింపుల వ్యవస్థల్లో పరిమాణ పరంగా యూపీఐ అగ్రస్థానంలో ఉందని గుర్తించింది.

యూపీఐ లైట్.. ఆటోపే.. క్రెడిట్ ఆన్ యూపీఐ

చిన్న మొత్తాల చెల్లింపుల కోసం యూపీఐ లైట్ వంటి ఫీచర్లనూ ఆవిష్కరించారు. క్రమం తప్పకుండా చెల్లించాల్సిన లావాదేవీల కోసం యూపీఐ ఆటోపే, ప్రీ–అప్రూవ్డ్ క్రెడిట్ కోసం క్రెడిట్ ఆన్ యూపీఐ వంటి సదుపాయాలూ ఉన్నాయి.

## ఓలా నుంచి కొత్త స్కూటర్..

### సింగిల్ ఛార్జింగ్‌తో 320 కిమీ

ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కొత్త స్కూటర్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన 4680 భారత్ సెల్‌తో తయారు చేసిన ఎస్1 ఎక్స్+ 5.2 ఎచ్‌ష్ట్ర వేరియంట్‌ను సోమవారం విడుదల చేసింది. దీని ధరను రూ.1,29,999గా నిర్ణయించింది. ఇన్‌హౌస్‌లో రూపుదిద్దుకున్న సెల్ టెక్నాలజీ సాయంతో తయారు చేసిన స్కూటర్ కావడంతో అందుబాటు ధరలో తేవడం సాధ్యమైందని ఓలా ఎలక్ట్రిక్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్ 15 వరకు ప్రారంభ ధర కింద రూ.1.29 లక్షలకు విక్రయించనున్నట్లు ఓలా తెలిపింది. ఇందులో 11ఎచి మిడ్ డ్రైవ్ మోటార్‌ను అమర్చినట్లు వెల్లడించింది. సింగిల్ ఛార్జింగ్‌తో 320 కిలోమీటర్లు (ఎఆఅ రేంజ్) ప్రయాణించొచ్చని పేర్కొంది. ఈ స్కూటర్ టాప్ స్పీడ్ గంటకు 125 కిలోమీటర్లు. బ్రేకింగ్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ బ్రేక్ బై వైర్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్ సదుపాయంతో తీసుకొచ్చినట్లు ఓలా వెల్లడించింది. ఓలా ఎలక్ట్రిక్ ఎస్1 ప్రో స్కూటర్లతో పాటు రోడ్‌స్టర్ విద్యుత్ మోటార్ సైకిళ్లను విక్రయిస్తోంది. ఎస్1 థర్డ్ జనరేషన్‌లో ఎస్1 ప్రో+ , ఎస్ 1ప్రో పేరుతో ప్రీమియం స్కూటర్లను విక్రయిస్తోంది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1 ఎక్స్+ ఎస్ 1 ఎక్స్ విక్రయిస్తోంది. రోడ్‌స్టర్ ఎక్స్+ను 4.5 9.1 కాన్ఫిగరేషన్‌తోనూ, రోడ్‌స్టర్ ఎక్స్‌ను 2.5, 3.5, 4.5 ఎచిష్ట్ర బ్యాటరీ సామర్థ్యంతోనూ విక్రయిస్తోంది. ఎస్1 ఎక్స్+ 5.2 ఈ శ్రేణిలో కొత్తగా చేరింది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.37 | ₹ 4.32 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,40,100 | ₹ 1,52,840 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,65,000

## మార్కెట్లకు నష్టసూచన!

### త్రైమాసిక ఫలితాలపైనా చూపు విశ్లేషకుల అంచనాలు

అమెరికా– ఇరాన్ మధ్య సంధి చర్చలు విఫలమైన నేపథ్యంలో.. దేశీయ ప్రామాణిక సూచీలు ఈ వారాన్ని ప్రతికూల ధోరణిలోనే ఆరంభించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముడి చమురు ధరల్లో కదలికలు, విదేశీ మదుపర్ల విక్రయాల ధోరణి, త్రైమాసిక ఫలితాలు కూడా సమీప కాలంలో మార్కెట్ సెంటిమెంటుపై ప్రభావం చూపనున్నాయి. నిఫ్టీ–50 సూచీకి 23,100–23,800 వద్ద మద్దతు, 24,025–24,500 వద్ద నిరోధం ఎదురుకావొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా కడుతున్నారు. ఈ వారం విప్రో, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ఫలితాలున్నాయి. మంగళవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా మార్కెట్లు పనిచేయవు. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలిలా.. టెలికాం కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. సగటు వినియోగదారు ఆదాయ(ఆర్పు) వృద్ధి కొనసాగుతుండడం, వినియోగదార్ల సంఖ్య పెరుగుతుండడం వంటి సానుకూలతల కారణంగా సమీప కాలంలో ఈ రంగానికి మద్దతు లభించొచ్చు. తదుపరి సానుకూల అంశం టారిఫ్ పెంపు కానుంది. ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి కదలాడవచ్చు. కమొడిటీ ధరలు పెరిగినందున ఈ రంగ ఆర్థిక ఫలితాలు స్తబ్దుగానే ఉండొచ్చని అంచనా. ఇంధన, విద్యుత్, లాజిస్టిక్ ద్రవ్యోల్బణం వల్ల ఏప్రిల్–సెప్టెంబరు ఫలితాలపైనా ప్రభావం పడొచ్చు. లోహ, గనుల షేర్లు పశ్చిమాసియా పరిణామాల ఆధారంగా కదలాడొచ్చు. మార్చి త్రైమాసిక ఫలితాలనూ గమనించాల్సి ఉంటుంది. నిఫ్టీ లోహ సూచీకి 12,450–12,509 వద్ద కీలక నిరోధం ఎదురుకావొచ్చు. ఈ శ్రేణికి పైన ముగిస్తేనే 12,830–13,000 దిశగా పయనించొచ్చు. ఫార్మా కంపెనీల షేర్లు కూడా ఒక శ్రేణిలో పరిమితం కావొచ్చు. మార్చి త్రైమాసిక ఫలితాలకు ముందు ఈ షేర్లలో తాజా కొనుగోళ్లపై ఆసక్తి కనిపించకపోవచ్చు. అమెరికాలో తక్కువ విక్రయాల కారణంగా ఫలితాలు దాదాపు స్తబ్దుగానే ఉండొచ్చన్న అంచనాలున్నాయి. మార్చి త్రైమాసికంలో సిమెంటు కంపెనీల అమ్మకాలు పుంజుకోవచ్చు. సీజనల్ గిరాకీ ఇందుకు కారణం. అల్ట్రాటెక్, అంబుజా బలమైన విక్రయాల వృద్ధిని నమోదు చేయొచ్చు. సిమెంటు కంపెనీలు దేశంలో ముఖ్యంగా దక్షిణ భారత్‌లో ధరలను పెంచవచ్చు. పశ్చిమాసియా సంక్షోభం కాస్త నెమ్మదిస్తుండడంతో నిఫ్టీ బ్యాంక్ సూచీ రాణించొచ్చు. అయితే మార్కెట్లో ఊగిసలాటలు కాస్తా ఈ సూచీపై ఒత్తిడిని తీసుకురావొచ్చు. అయినా స్వల్పకాలంలో సానుకూలంగా కనిపిస్తోంది. 54,500; 54,000 కీలక మద్దతు స్థాయిలుగా కనిపిస్తున్నాయి. పశ్చిమాసియా పరిణామాల మధ్య యంత్ర పరికరాల షేర్లు రాణించొచ్చు. ఫలితాల నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు.

## ఈ ఆర్థిక సంవత్సరంలో 25,000 మంది ఫ్రెషర్ల నియామకం

### టీసీఎస్ ఎండీ, సీఈఓ కృతివాసన్

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27)లో 25,000 మంది ఫ్రెషర్లను నియమించుకోబోతున్నట్లు ప్రముఖ ఐటీ సేవల సంస్థ టీసీఎస్ ఎండీ, సీఈఓ కె.కృతివాసన్ వెల్లడించారు. గిరాకీ ఆధారంగా మరింత మందిని నియమించుకుంటామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం (2025–26)లో టీసీఎస్ 44,000 మంది ఫ్రెషర్లకు అవకాశం కల్పించింది. ప్రైవేటు రంగంలో అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను నియమించుకున్న సంస్థగా నిలిచింది. ఇతర కంపెనీల నుంచి ఉద్యోగులను నియమించుకునే విషయంలో కంపెనీ ఏమైనా మార్పులు చేసిందా? అని కృతివాసన్‌ను ప్రశ్నించగా.. సాధారణంగా ఒక ఫ్రెషర్‌కి శిక్షణ ఇచ్చి అతడు పూర్తి స్థాయి ఉద్యోగిగా మారడానికి 9 నెలల సమయం పడుతుందన్నారు. ఇతర కంపెనీ ఉద్యోగి అయితే వెంటనే అందుబాటులోకి వస్తారన్నారు. వ్యాపార అవసరాల ఆధారంగా నియామక వ్యూహాలు మారుతూ ఉంటాయని పేర్కొన్నారు. గడిచిన మూడేళ్లలో కనీసం 40,000 లేదా అంతకంటే ఎక్కువ మంది ఫ్రెషర్లను కంపెనీ నియమించుకుంటూ వచ్చిందని పేర్కొన్నారు.

# ప్రపంచానికి చమురు షాక్..

## హర్మూజ్‌ను దిగ్బంధిస్తే క్రూడ్ 150 డాలర్లకు?



టెహ్రాన్: ఇరాన్– అమెరికా మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. కాల్పుల విరమణ ఒప్పందంతో 100 డాలర్లకు దిగువకు వచ్చిన బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర మళ్లీ సెంచరీ దాటేసింది. ట్రంప్ హెచ్చరించినట్లు హర్మూజ్‌ను పూర్తిగా దిగ్బంధిస్తే చమురు ధర 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. టెహ్రాన్‌కు అక్రమంగా టోల్ చెల్లించే ఏ నౌకనూ ఆ జలసంధిలో ప్రయాణించనివ్వొద్దని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. మరోవైపు, సీజ్ ఫైర్‌ను ఉల్లంఘించి ఏదైనా సైనిక నౌక హర్మూజ్‌కు చేరుకుంటే దాన్ని తీవ్రంగా పరిగణిస్తామని ఇరాన్ ఐఆర్‌జీసీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 8 శాతం పెరిగి 103 డాలర్లకు చేరింది. అయితే, దిగ్బంధనం బెదిరింపులు ఇంకా పూర్తిగా ధరల్లో ప్రతిబింబించలేదని ఓనిక్స్ క్యాపిటల్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్ మోంటెపెక్ అన్నారు. ట్రంప్ హెచ్చరికలు కార్యరూపం దాలిస్తే బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 140, 150 డాలర్లకు చేరువ కావడం ఖాయమని ఓ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

**5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ల సరఫరా పెంపు**

హర్మూజ్ గుండా కొన్ని దేశాలకు చెందిన నౌకలు యథాతథంగా ప్రయాణిస్తున్నాయి. ట్రంప్ చెప్పినట్లు ఏ నౌకనూ అనుమతించకపోతే రోజుకు 12 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా ప్రమాదంలో పడుతుందని మోంటెపెక్ అన్నారు. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురు కొరతకు దారితీస్తుందన్నారు. అదే జరిగితే ఇప్పటి వరకు ఒక ప్రాంతానికే పరిమితమైన ఈ యుద్ధం.. ప్రపంచ వ్యాప్త పోరుకు దారితీయొచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతానికి పూర్తి స్థాయి దిగ్బంధనం జరగకపోవచ్చని మార్కెట్ అంచనా వేస్తోందన్నారు.

## పేటెంట్ దరఖాస్తులు 1.43 లక్షలు

### 2025–26లో 30.2% వృద్ధి: పీయూశ్ గోయల్

**న్యూఢిల్లీ:** మేధో సంపత్తి హక్కుల వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన పలు చర్యల వల్ల, మన దేశంలో పేటెంట్ దరఖాస్తుల ఫైలింగ్ 30.2 శాతం పెరిగి 1,43,729కు చేరాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ తెలిపారు. 2024–25లో ఇవి 1,10,375గా ఉన్నాయి. ప్రస్తుతం పేటెంట్ ఫైలింగ్‌లో భారత్, ప్రపంచంలోనే 6వ అతిపెద్ద దేశంగా ఉంది. '2025–26లో మన పేటెంట్ ఫైలింగ్స్ రికార్డు స్థాయిలో 1.43 లక్షలను దాటాయి. గత ఏడాదితో పోలిస్తే ఇది 30.2% ఎక్కువ. ఇందులో 69% దరఖాస్తులు దేశీయంగానే వచ్చాయి. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఆవిష్కర్తలు ముందంజలో ఉన్నారు. దేశంలో పేటెంట్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ముఖ్యంగా అంకుర సంస్థలు, ఎంఎస్ఎంఈలు, విద్యాసంస్థల కోసం పలు చర్యలు చేపట్టింది. పేటెంట్ ఫీజు తగ్గింపు, వేగంగా దరఖాస్తుల పరిశీలన, పేటెంట్, ట్రేడ్‌మార్క్, డిజైన్ దరఖాస్తుల ఫైలింగ్ కోసం అంకుర సంస్థలకు ఉచిత సహాయం వంటివి ఇందులో ఉన్నాయి.

## స్థిరాస్తి సంస్థలపై దివాలా ప్రక్రియ డిఫాల్ట్ ప్రాజెక్టుకే పరిమితం కావాలి

**న్యూఢిల్లీ:** స్థిరాస్తి సంస్థలపై గృహ కొనుగోలుదారులు ప్రారంభించిన దివాలా ప్రక్రియలు, డిఫాల్ట్ జరిగిన నిర్దిష్ట ప్రాజెక్టుకే పరిమితమై ఉండాలని, కార్పొరేట్ రుణగ్రహీతకు సంబంధించిన ఇతర ప్రాజెక్టులకు విస్తరించకూడదని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) పునరుద్ఘాటించింది. డిఫాల్ట్‌కు సంబంధం లేని స్థిరాస్తి సంస్థల ఇతర ప్రాజెక్టులన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం గృహ కొనుగోలుదారులకు, ఇతర ప్రాజెక్టుల వాటాదారులకు ప్రయోజనకరం కాదని అప్పిలేట్ ట్రైబ్యునల్ నొక్కిచెప్పింది. ఒకే ప్రాజెక్టుకు చెందిన ఆర్థిక రుణదాతలు, గృహ కొనుగోలుదారులు ప్రాజెక్టుకు సంబంధించి కార్పొరేట్ రుణగ్రహీత చేసిన డిఫాల్ట్ కారణంగా సెక్షన్ 7 దరఖాస్తును దాఖలు చేసినప్పుడు, కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ (సీఐఆర్‌పీ) ఆ ప్రాజెక్టుకే పరిమితం కావాలనేది చట్టంలో సుస్పష్టంగా ఉందని ఎన్‌సీఎల్ఏటీ వివరించింది. నవీన్ ఎం రహేజా దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరుపుతున్న ఇద్దరు సభ్యుల ఎన్‌సీఎల్ఏటీ ధర్మాసనం, సంబంధం లేని ప్రాజెక్టులకు నష్టం కలిగించడం ఇతర ప్రాంతాల గృహ కొనుగోలుదారులు, వాటాదారుల ప్రయోజనాలకు ఉపయోగపడదని పేర్కొంది. సీఐఆర్‌పీని ప్రాజెక్టుల వారీగా పరిమితం చేయాలని స్పష్టం చేసింది. రహేజా డెవలపర్స్‌కు చెందిన మరో ప్రాజెక్టుకు సంబంధించి గత నెలలో ఒక ఉత్తర్వును జారీ చేస్తూ సీఐఆర్‌పీ కేవలం రహేజా శిలాస్ అనే ప్రాజెక్టుకు మాత్రమే పరిమితమని పేర్కొన్న ఎన్‌సీఎల్ఏటీ, ఆ తీర్పు ప్రస్తుత కేసుకు పూర్తిగా వర్తిస్తుందని, దానిని తప్పనిసరిగా పాటించాలని తెలిపింది. రహేజ్ డెవలపర్స్‌పై కొనసాగుతున్న సీఐఆర్‌పీని మొత్తం గ్రూప్‌నకు కాకుండా, కేవలం 'కృష్ణ హౌసింగ్ పథకానికి' మాత్రమే ఎన్‌సీఎల్ఏటీ పరిమితం చేసింది.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

రాయ్‌పూర్(జనంసాక్షి): ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో మహిళా మావోయిస్టు కమాండర్ రూపీ మృతి చెందారు. కాంకేర్ జిల్లాలోని ఛోటే బెట్టియా అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రూపీపై రూ.5 లక్షల బహుమతి ప్రకటించబడినట్లు అధికారులు తెలిపారు. మావోయిస్టులు ఉన్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా భద్రతా దళాలు ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టగా, ఈ సందర్భంగా ఇరుపక్షాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ అనంతరం రూపీ మృతదేహంతో పాటు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. ఆ ప్రాంతంలో మరికొందరు మావోయిస్టులు దాగి ఉన్నారనే అనుమానంతో విస్తృతంగా గాలింపు కొనసాగుతోంది. గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అక్కడి నుంచి అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారు దట్టమైన అటవీ ప్రాంతాన్ని ఉపయోగించి తప్పించుకున్నారని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. వారిని గుర్తించి పట్టుకోవడానికి ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ప్రాంతాన్ని పూర్తిగా చుట్టుముట్టి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. భద్రతా బలగాలు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరి కొంతమంది మావోయిస్టులు అటవీలో దాగి ఉండవచ్చనే అనుమానంతో ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయి. మావోయిస్టుల కదలికలపై గత కొంతకాలంగా భద్రతా బలగాలు నిఘా పెంచాయి. వారికి వచ్చిన సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్‌ని చేపట్టినట్లు తెలుస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్ జాగ్రత్తగా కొనసాగుతోంది. ఈ ప్రాంతం గతంలో కూడా మావోయిస్టు కార్యకలా పాలకు కేంద్రంగా ఉంది. తరచూ భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరుగుతు న్నాయి. మావోయిస్టులు ఉద్యమం ప్రభావం ఈ ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతోండటంతో భద్రతా సవాళ్లు నెలకొన్నాయి. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. మిగిలిన మరికొంతమంది మావోయిస్టులను పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలు ఉపయోగిస్తున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ మరికొన్ని గంటలు లేదా రోజులు కొనసాగవచ్చని భద్రతా వర్గాలు చెబుతున్నాయి. మాచపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందడం, పలువురు తప్పించుకోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## 2026–27లో భారత వృద్ధి రేటు 7.1%

### అంచనాలు పెంచిన ఎస్ అండ్ పీ

**దిల్లీ:** వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో భారత వృద్ధి 7.1 శాతానికి పెరగొచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేసింది. ప్రైవేట్ వినియోగం, పెట్టుబడులు, ఎగుమతులు ఇందుకు దోహదపడతాయని తాజా త్రైమాసిక ఆసియా–పసిఫిక్ ఆర్థిక వివరాల్లో తెలిపింది. కీలక అంచనాలు ఇలా: 2026–27లో వాస్తవ జీడీపీ వృద్ధి 7.1 శాతంగా ఉండొచ్చని ఎస్ అండ్ పీ అంచనా వేసింది. 2025–26లో 7.6 శాతంగా ఉంటుందని పేర్కొంది. 2025–26 వృద్ధి అంచనాలను 0.4 శాతం పెంచి 7.6 శాతానికి, 2026–27 అంచనాలను 0.2 శాతం పెంచి 7.1 శాతానికి సవరించింది. 2026–27లో ద్రవ్యోల్బణం తక్కువ స్థాయిల నుంచి 4.3 శాతానికి పెరుగుతుందని భావిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచొచ్చని, తటస్థ వైఖరిని పాటించొచ్చని ఎస్ అండ్ పీ అంచనా వేస్తోంది. చమురు ధర పెరిగితే వడ్డీ రేట్ల పెంపు: భారత ఆర్థిక వ్యవస్థపై చమురు ధరల ప్రభావం పడే అవకాశం ఉంది. పెరిగిన ముడిచమురు ధరల వల్ల వాణిజ్య లోటు పెరగొచ్చు. కానీ సేవల వాణిజ్యంలో మిగులు కారణంగా కరెంటు ఖాతా లోటు అదుపులో ఉంటుంది. చమురు ధరలు పెరిగితే సబ్సిడీ ఖర్చులను నియంత్రించడానికి మన దేశంలో ఇంధన ధరలను పెంచొచ్చు. ప్రాథమిక అంచనాల ప్రకారం జూన్ త్రైమాసికంలో బ్యారెల్ బ్రెంట్ చమురు సగటున 92 డాలర్లు, 2026లో 80 డాలర్లుగా ఉండొచ్చని ఎస్ అండ్ పీ భావిస్తోంది. ఒకవేళ ప్రతికూల పరిస్థితులు ఎదురై చమురు ధర జూన్ త్రైమాసికంలో సగటున 185 డాలర్లకు చేరితే, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ పేర్కొంది. ఇదే జరిగితే ఈ ఏడాది ద్వితీయార్థంలో 25 బేసిస్ పాయింట్ల (0.25%) మేర రేట్ల పెంపు ఉండొచ్చని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ఇ–కామర్స్, టెక్ స్టార్టప్‌ల నియామకాలు 4.7 శాతం మేరకు వృద్ధి చెందే అవకాశం ఉందని ఒక నివేదిక వెల్లడించింది. ఉద్యోగాల కల్పన పట్ల సానుకూల దృక్పథం ప్రధానంగా భారీ సంస్థల్లోనే ఎక్కువగా కనిపిస్తోంది. నియామకాలను పెంచేందుకు వీటిలో 74 శాతం వరకూ మొగ్గు చూపిస్తున్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ (ప్రాజెక్ట్) విడుదల చేసిన 'ఎంప్లాయిమెంట్ అవుట్‌లుక్ రిపోర్టు' పేర్కొంది. మధ్య తరహా సంస్థల్లో ఇది 57 శాతంగా, చిన్న వ్యాపార సంస్థల్లో 38 శాతంగా ఉందని తెలిపింది. ఏప్రిల్–సెప్టెంబరు కాలానికి ఇచ్చిన అంచనాల ప్రకారం.. పరిశ్రమల మద్దతుతో డిజిటల్, ఇతర రంగాల్లో సానుకూల వాతావరణం




కనిపిస్తోందని పేర్కొంది. ముఖ్యంగా ఇ–కామర్స్, టెక్ స్టార్టప్ రంగాలు అత్యధికంగా 8.9 శాతంతో ముందు వరుసలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో ఆరోగ్య సంరక్షణ, ఔషధ, తయారీ, ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల రంగాలు ఉన్నట్లు నివేదిక వివరించింది. ఈ ఆరు నెలల కాలంలో మొత్తం మీద నికర ఉపాధి 4.7 శాతంగా ఉంటుందని పేర్కొంది.

### టీసీఎస్ నాసిక్ క్యాంపస్‌లో లైంగిక వేధింపులు..

## ఏడుగురు ఉద్యోగులపై వేటు

**నాసిక్ :** టీసీఎస్ నాసిక్ క్యాంపస్ వ్యవహారం సంచలనంగా మారింది. లైంగిక వేధింపులు, మత మార్పిడులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కొంతమంది ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. హెచ్ఆర్ మేనేజర్ సహా ఏడుగురు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై టీసీఎస్ స్పందించింది. అరెస్టయిన ఉద్యోగులను సస్పెండ్ చేశామని తెలిపింది. పని ప్రదేశంలో ఇలాంటి వేధింపులను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేసింది. పోలీసు విచారణకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నామని తెలిపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాసిక్ క్యాంపస్‌లో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగి తన సహోద్యోగిపై ఫిర్యాదు చేశారు. పెళ్లి పేరుతో తనను మోసగించినట్లు అందులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసే క్రమంలో మరో ఏడుగురు మహిళలు ముందుకొచ్చి.. తమపై జరిగిన వేధింపుల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో హెచ్ఆర్ మేనేజర్ సహా అసిఫ్ అన్సారీ, షఫీ షేక్, షారుఖ్ ఖురేషి, రజా మేమన్, తౌసిఫ్ అత్తర్, డానిష్ షేక్ పేర్లు కూడా వెలుగులోకి వచ్చాయి. 2022 ఫిబ్రవరి నుంచి 2026 మధ్య పని ప్రదేశంలో వీరు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సదరు మహిళా ఉద్యోగులు పేర్కొన్నారు.

## శ్రీపాదరావుకు సీఎం రేవంత్ నివాళి



హైదరాబాద్ (జనంసాక్షి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27 వ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో వారి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళ్లు అర్పించారు. తెలుగు రాష్ట్రాలలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఈ సందర్భంగా సీఎం అన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అన్ని పదవులకు వన్నె తెచ్చిన నేత అని ఆయన కొనియాడారు. శాసనసభ ఔనత్యాన్ని పెంపొందిస్తు హుందాగా ఆయన సభను నడిపిన తీరు శ్లాఘనీయమని ముఖ్యమంత్రి అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి,ఎంఎల్ ఏ సంజయ్ ఉన్నారు.

## విషపు బాలామృతం తిని బాలుడు మృతి

### కోతుల చంపడానికి పెట్టిన విషపు ఎరకు బలి




గోవిందరావుపేట (జనం సాక్షి) : మండల కేంద్రంలో కోతులను చంపడానికి ఏర్పాటు చేసిన విషపు ఎరకు బాలుడు బలయ్యాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం .. శ్రావణ్ మమత దంపతులకు ఇద్దరమ్మాయిలు, ఒక అబ్బాయి హర్ష నందన్ (5) ఉన్నారు. ఆదివారం అక్కలతో ఆడుకుంటూ ఒకచోట అంగన్వాడీ కేంద్రం పక్కన నర్సరీ సమీపంలో కవర్లలో ఉంచిన బాలామృతం చూసి అక్కలు తిని ఉమ్మి వేశారు. హర్షవర్ధన్ మాత్రం తిని అస్వస్థకు గురయ్యాడు. సాయంత్రం మెరుగైన వైద్యం కోసం తీసుకువెళ్లిన ఫలితం లేకపోయింది. మృత్యువుతో పోరాడి బాలుడు చనిపోయాడు. గ్రామపంచాయతీ సిబ్బంది కోతుల ను చంపేందుకు అంగన్వాడీ కేంద్రంలోని బాలామృతం లో విషపు గుళికలు కలిపి ఎరగ వేయడం వల్లే ఎరగని పిల్లలు తిని వారిలో ఒకరు మృత్యువాత పడ్డారని గ్రామస్తులు అంటున్నారు. ఈ మేరకు పసర పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు ఇచ్చిన పిడిషన్ ఆధారంగా కేసు కూడా నమోదు చేసినట్లు ఎస్హెచ్ఓ ఎస్కే తాజుద్దీన్ తెలిపారు. అన్ని కోణాలలో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు సిఐ దయాకర్ పేర్కొన్నారు. పోస్టుమార్టం అనంతరం మండల కేంద్రానికి బాలుని మృతదేహాన్ని తీసుకురాగా గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేయాలని చాలామంది గుమి కూడగా పోలీసులు నచ్చజెప్పి ఇంటి వద్దకు బాడీని తీసుకువచ్చారు. అనంతరం పలువురు రాజకీయ పార్టీల నాయకులు మృతుల కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. బాలుని కుటుంబానికి కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల పోషనార్థం ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. పలువురుతో చర్చలు జరిపి సీఐ, ఎస్ఐలు పరిస్థితిని ఒక కొలిక్కి తీసుకు వచ్చేందుకు చర్చలు నిర్వహిస్తున్నారు. బాలుని తండ్రి ఆర్ఎంపి వైద్యుడు కావడంతో మండల ఆర్ఎంపి వైద్యులు కూడా భారీ సంఖ్యలో తరలివచ్చి సానుభూతి వ్యక్తం చేశారు.

## తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### స్కూటీని ఢీకొట్టిన లారీ

- ప్రమాదంలో దంపతులు సహా చిన్నారి మృతి



వికారాబాద్, ఏప్రిల్13 (జనంసాక్షి) : వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూ వీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని త్తటెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.

## వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో మరోసారి సునీత పిటీషన్

హైదరాబాద్, ఏప్రిల్13 (జనంసాక్షి) : మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగించేలా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను వివేకా కూతురు సునీతా రెడ్డి దాఖలు చేశారు. ఈ కేసులో కొన్ని కోణాలపై సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయలేదని, పలు అనుమానాలకు సమాధానాలు రాలేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల మరింత సమగ్ర తదుపరి దర్యాప్తు జరపాలని హైకోర్టును కోరారు. ఈ కేసు ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తులో ఉంది. గతంలో సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కొన్ని వ్యక్తుల మధ్య జరిగిన ఫోన్ కాల్ డేటా సహా పలు సాంకేతిక ఆధారాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టింది. తదుపరి దర్యాప్తులో కొందరి పాత్ర లేదని పేర్కొంటూ సీబీఐ కోర్టుకు ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. ఈ దర్యాప్తుపై పిటిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సునీతా రెడ్డి తన పిటిషన్‌లో పలు కీలక విషయాలను పేర్కొ న్నారు. పలు సందేహాలకు సీబీఐ దర్యాప్తులో సమాధానం రాలేదని తెలిపారు. కొన్ని కోణాల్లో విచారణ పూర్తిగా జరగలేదని అన్నారు. ఈ కేసులోని కొన్ని అనుమానాస్పద అంశాలను విస్మరించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అందువల్ల సీబీఐ కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి, కేసులో ఇంకా స్పష్టత లేని అంశాలపై మరింత దర్యాప్తు చేయాలని ఆదేశించాలంటూ ఆమె హైకోర్టును అభ్యర్థిం చారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోంది.

## అరైవ్ అలైవ్‌పై అవగాహన



హైదరాబాద్ (జనంసాక్షి) : సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గచ్చిబౌలిలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ స్థానికంగా ఉన్న ప్రజలకు రోడ్డు భద్రత కార్యక్రమం 'అర్రైవ్ అలైవ్' గురించి అవగాహన కల్పించారు. సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని అభిలాషిస్తూ తదనుగుణంగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, ఇతర పోలీసు అధికారులతో కలిసి వారికి వివరించారు.ట్రాఫిక్-1 డీసీపీ రంజన్ రతన్ కుమార్, ట్రాఫిక్-1 అదనపు డీసీపీ హనుమంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విధాన నిర్ణయాల్లో యువత భాగస్వామ్యం పెరగాలి

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : యువత భవిష్యత్తు మాత్రమే కాకుండా వర్తమానంలో మార్పును తీసుకువచ్చే శక్తి అని, బలమైన, సమగ్ర భారతదేశ నిర్మాణానికి వారి ఆలోచనలు, భాగస్వామ్యం కీలకమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా చేగూరులోని కన్హా శాంతి వనం వద్ద నిర్వహించిన "మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026 -నేషనల్ యూత్ డైలాగ్ (తెలంగాణ, తమిళనాడు)' గ్రాండ్ ఫినాలే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా యువత ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకమని గవర్నర్ పేర్కొన్నారు. యువతను విధాన నిర్ణయ ప్రక్రియతో అనుసంధానించే సమర్థవంతమైన వేదికగా మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026 కార్యక్రమం నిలిచిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భాగస్వామ్య పరిపాలనను బలోపేతం చేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, బడ్జెట్, అభివృద్ధి ప్రాధాన్యాల్లో యువత అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని అన్నారు. చర్చల్లో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై యువత ఇచ్చిన సూచనలు దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని గవర్నర్ పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత శక్తి, సృజనాత్మకత, నిబద్ధత కీలకమని గవర్నర్ స్పష్టం చేశారు. 'నారీ శక్తి- వికసిత భారత్ వాయిస్" అంశం కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకువచ్చిందని గవర్నర్ తెలిపారు. మహిళల భాగస్వామ్యం, నాయకత్వం సమగ్రాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. యువ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు యువ మహిళలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరచేందుకు, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వేదికగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పార్లమెంటరీ విధానాన్ని అనుకరించి నిర్వహించిన చర్చలు పాల్గొన్న వారిలో ఆత్మవిశ్వాసం, సంభాషణ సామర్థ్యం, ప్రజా సమస్యలపై అవగాహనను పెంపొందిస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను చేర్చడం అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు. సుస్థిరాభివృద్ధి ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని, యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా చెందిన కొట్ల రఘువీర్ రెడ్డికి వ్యవసాయ రంగంలో చేసిన వినూత్న ఆవిష్కరణకు గాను గవర్నర్ అవార్డు ప్రదానం చేశారు. ఆయన ఆవిష్కరణను ప్రధాని "మన్ కీ బాత్" కార్యక్రమంలో ప్రశంసించిన విషయం గవర్నర్ ప్రస్తావించారు. బడ్జెట్ క్వెస్ట్-2026 గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో తమిళనాడు నుంచి 550 మంది, తెలంగాణ నుంచి 350 మంది యువత పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అన్వేష్ చింతల్, జాతీయ సేవా పథకం ప్రాంతీయ డైరెక్టర్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) రామకృష్ణరావు, మై భారత్ తమిళనాడు రాష్ట్ర డైరెక్టర్ సెంథిల్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## వచ్చే విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

- 15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ
- తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల




హైదరాబాద్, ఏప్రిల్13 (జనంసాక్షి) : రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026-27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ పక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

## ఒంటరి వృద్ధురాలిపై దాడి

### రోకలిబండతో బాదిన దుండుగులు

### బంగారం దోచుకుని పరార్



కామారెడ్డి, ఏప్రిల్13 (జనంసాక్షి) : కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బంగారు ఆభరణాల సమాచారం ముందుగానే తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందా లేదా అకస్మాత్తుగా జరిగిన దోపిడీనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ససమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, అనుమానితులను గుర్తించడానికి చర్యలు చేపట్టారు. స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## పెండింగ్ ప్రాజెక్టులపై అధ్యయనం

### సాగునీటి జలవనరుల దోపిడీని అరికట్టాలని డిమాండ్



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరుగుతున్న అన్యాయంపై పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణ విషయంలో జరుగుతున్న అసంతృప్తిపై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన పెండింగ్ ప్రాజెక్టులతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ను సందర్శించడానికి అధ్యయన బృందం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించడానికి వస్తుందని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపడుతున్న రిజర్వాయర్ల నిర్మాణ పనులను సందర్శించడంతోపాటు డిండి, ఎత్తిపోతల పథకం పేరుతో సాగునీటి జలవనరుల దోపిడీని అరికట్టాలని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగి దాదాపు 12 సంవత్సరాలు గడుస్తున్న షాద్ నగర్ ప్రాంతానికి, ఉమ్మడి మహబూబ్ నగర్ దక్షిణ ప్రాంతానికి చుక్క నీరు అందడం లేదని ఇది పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రాంత రైతాంగానికి తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన ఆధ్యయన బృందం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి స్థానిక శాసనసభ్యులను కలిసి వినతి పత్రం అందించడం జరుగుతుందని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించడానికి షాద్ నగర్ ప్రాంతంలోని వివిధ ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాలమూరు ఆధ్యయన వేదిక నాయకులు నర్సింలు టీ జేఏసీ మాజీ చైర్మన్ టిజీ శ్రీనివాస్ బీసీ జేఏసీ నాయకులు బుస జంగయ్య ,వెంకటేష్ ముదిరాజ్ సిపిఎం పార్టీ నాయకులు ఈశ్వర్ యుటిఎఫ్ నాయకులు నర్సింలు గౌడ్ బిజిలి సత్యం వలిగే కృష్ణ, నర్సింలు, పౌర హక్కుల సంఘం నాయకులు తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు..



## ఆశా భోస్లేకు సచిన్ నివాళి

ముంబై, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : ఆశా భౌతికకాయానికి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అతడి భార్య అంజలితో కలిసి నివాళులు అర్పించాడు. ఆశా భోస్లేతో సచిన్ కుటుంబానికి చాలా కాలంగా అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తూ సచిన్ కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపాడు. అతడితో పాటు ఆశా భోస్లేను చివరిసారిగా చూసేందుకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు కూడా కన్నీటి వీడ్కోలు పలికారు. సంగీత ప్రపంచంలో ఆమె సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ప్రముఖులు నివాళులు అర్పించారు. ప్రముఖ గాయని ఆశా భోస్లే ఆదివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 92 ఏళ్ల వయసులో ఆమె కన్నుమూశారు. ఆశా అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజి పార్క్‌లో జరిగాయి. ఆమె భౌతికకాయాన్ని సందర్శనార్థం ముంబైలోని నివాసంలో ఉంచగా పలువురు ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు.

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ..బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కు లీగల్ నోటీసు పంపించారు. మంత్రి తరఫున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ నోటీసు పంపించారు. నోటీసులో అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని, టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ కేటాయించడం జరిగిందని, ఇందులో తన ప్రమేయం లేదని మంత్రి స్పష్టం చేశారు.

### గంజాయి అమ్ముతున్న టెక్కీ అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్13 (జనంసాక్షి) : డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గం ఎంచుకున్నాడో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మరో వ్యక్తితో కలిసి నగరంలో గంజాయి విక్రయాలు మొదలుపెట్టాడు. ఆ ఇద్దరిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి నానక్‌రామ్ గూడలో గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రేమానంద్ మల్లిక్, క్యాబ్ డ్రైవర్ విశాల్‌ను శేర్లింగంపల్లి ఎస్ఓటి, గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రేమానంద్ మల్లిక్, డ్రైవర్ విశాల్‌ను అరెస్ట్ చేశారు.

# రహదారులు.. పార్కులే లక్ష్యంగా ఆక్రమణలు

### హైడ్రా ప్రజావాణికి 46 ఫిర్యాదులు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (జనంసాక్షి) : కాలనీల నుంచి అధికమొత్తంలో ఫిర్యాదులు వస్తున్నాయి. లే ఔట్ వేసినప్పుడు చూపించిన పార్కులు తర్వాత ప్లాట్లుగా మారిపోతున్నాయని పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రహదారికి ఇరువైపులా ప్లాట్లు కొనడం.. మధ్యలో రహదారిని మాయం చేయడం లే ఔట్లలో పరిపాటిగా మారింది. బాగ్ హయత్‌నగర్ జగదాంబా కాలనీలో విజయవాడ హైవే వైపు తాత్కాలిక గుడారాలు ఏర్పాటు చేసి కిరాయిలు వసూలు చేస్తున్నారు. జగదాంబా కాలనీ - పక్కనే ఉన్న బీడీఎల్ కాలనీని కలిపే రహదారికి అడ్డంగా గోడ కట్టి తాత్కాలిక షెడ్డులు ఏర్పాటు చేశారని ఫొటోలతో సహా ఫిర్యాదు చేశారు. అమీన్‌పూర్ మండలం, విలేజ్‌లోని ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లే ఔట్ ఆక్రమణలకు గురి అవుతోందని.. పాత లే ఔట్ను పట్టించుకోకుండా రహదారులు, పార్కులు ఆక్రమించి ఇళ్లు కట్టేస్తున్నారని సొసైటీ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఉప్పల్ ఈస్ట్ కళ్యాణపురిలోని జీహెచ్ ఎంసీ పార్కులో జీ ప్లస్ 2 భవనాన్ని కట్టారని అక్కడి సంక్షేమ సంఘం ఫిర్యాదు చేసింది. తుర్కయాంజల్ మున్సిపాలిటీ నీలాద్రినగర్ కాలనీ ఫేజ్ -2 లో రహదారులు ఆక్రమణకు గురయ్యాయని, కాప్రా విలేజ్‌లోని జై జవాన్ కాలనీ 333 ప్లాట్లతో వెలసి.. 7 చోట్ల ప్రజావసరాలకు కేటాయించిన



స్థలాల్లో 6 చోట్ల పార్కులు, ప్రజల వినియోగంలో ఉన్నా.. 7వ స్థలంలో ప్లాట్లు మూడు వెలిసాయని వెంటనే వాటిని తొలగించాలని ప్రజావాణి ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, బౌరంపేట్ గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినట్లు అక్కడి స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని బౌరంపేట్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కోసం ఈ భూమిని కేటాయించాలని కోరారు. ఇలా వివిధ ఆక్రమణలపై హైడ్రా ప్రజావాణికి మొత్తం 46 ఫిర్యాదులు రాగా.. హైడ్రా అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్ విచారించి.. పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

# 2047నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత శక్తి కీలకం

- విధాన నిర్ణయాల్లో యువత భాగస్వామ్యం పెరగాలి : రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** యువత భవిష్యత్తు మాత్రమే కాకుండా వర్తమానంలో మార్పును తీసుకువచ్చే శక్తి అని, బలమైన ,సమగ్ర భారత దేశ నిర్మాణానికి వారి ఆలోచనలు, భాగస్వామ్యం కీలకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు సోమవారం రంగారెడ్డి జిల్లా చేగూరు లోని కన్హాశాంతి వనం లో నిర్వహించిన "మై భారత్ బడ్జెట్ క్వెస్ట్--2026 -- నేషనల్ యూత్ డైలాగ్ (తెలంగాణ, తమిళనాడు)" గ్రాండ్ ఫినాలే కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు దేశవ్యాప్తంగా యువత ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకమని గవర్నర్ పేర్కొన్నారు. యువతను విధాన నిర్ణయ ప్రక్రియతో అనుసంధానించే సమర్థవంతమైన వేదికగా మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026 కార్యక్రమం నిలిచిందన్నారు.

ఇలాంటి కార్యక్రమాలు భాగస్వామ్య పరిపాలనను బలోపేతం చేసి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, బడ్జెట్ మరియు అభివృద్ధి ప్రాధాన్యాల్లో యువత అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరమని అన్నారు,చర్చల్లో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై యువత ఇచ్చిన సూచనలు దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని గవర్నర్ పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత శక్తి, సృజనాత్మకత, నిబద్ధత కీలకమని గవర్నర్ స్పష్టం చేశారు,నారీ శక్తి వికసిత భారత్ వాయిస్"అంశం కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతను తీసుకువచ్చిందని గవర్నర్ తెలిపారు. మహిళల భాగస్వామ్యం, నాయకత్వం సమగ్రాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. యువ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు యువ మహిళలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరచేందుకు, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు వేదికగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పార్లమెంటరీ




విధానాన్ని అనుకరించి నిర్వహించిన చర్చలు పాల్గొన్న వారిలో ఆత్మవిశ్వాసం, సంభాషణ సామర్థ్యం, ప్రజా సమస్యలపై అవగాహనను పెంపొందిస్తాయని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలను చేర్చడం అభినందనీయమని గవర్నర్ పేర్కొన్నారు. సుస్థిరాభివృద్ధి ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని, యువత దేశ నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు ఈసందర్భంగా సూర్యాపేట జిల్లాకు చెందిన కొట్ల రఘువీర్ రెడ్డికి వ్యవసాయ రంగంలో చేసిన వినూత్న ఆవిష్కరణకు గవర్నర్ అవార్డు ప్రదానం చేశారు. ఆయన ఆవిష్కరణను ప్రధాని "మన్ కీ బాత్" కార్యక్రమంలో ప్రశంసించిన విషయం గవర్నర్ ప్రస్తావించారు,బడ్జెట్ క్వెస్ట్--2026 గ్రాండ్ ఫినాలే కార్యక్రమంలో తమిళనాడు నుంచి 550 మంది, తెలంగాణ నుంచి 350 మంది యువత పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రరెడ్డి, మై భారత్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ అన్వేష్ చింతల్, జాతీయ సేవా పథకం ప్రాంతీయ డైరెక్టర్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) రామకృష్ణరావు, మై భారత్ తమిళనాడు రాష్ట్ర డైరెక్టర్ సెంథిల్ కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు...

# అనాజ్‌పూర్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం

### -ఎఫ్‌టీఎల్ భూముల్లో అక్రమ రోడ్డు పనులు నిలిపివేయాలని డిమాండ్

**అబ్దుల్లాపూర్ మెట్టు, ఏప్రిల్ 13 (జనం సాక్షి ):** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, అనాజ్‌పూర్ గ్రామంలో జీనియస్ విలాస్ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు వేముల కత్వ, ఇందిరా సాగర్ ప్రాంతాల్లో చేస్తున్న అక్రమ కబ్జాలపై అఖిలపక్ష పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామపంచాయతీ ముందు వర్కల బాలరాజు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఎం, సీపీఐ, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ



నాయకులతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ జీనియస్ విలాస్ రియల్ ఎస్టేట్ వారు అధికార పార్టీ అండదండలతో వేముల కత్వ ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పరిమితుల్లోకి వచ్చి, హద్దు రాళ్లు పెట్టినప్పటికీ, వాటిని లెక్కచేయకుండా 50 ఫీట్ల లోపల భారీ రహదారి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. జీనియస్ విలాస్‌కు సరైన రహదారి లేకపోవడంతో ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి రోడ్డు వేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఎఫ్‌టీఎల్ పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులను నిలిపివేసి, ఇప్పటికే పోసిన మట్టి, రాళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తీవ్ర స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ నవనీత మహేష్ మాట్లాడుతూ గ్రామ ఆస్తులను కాపాడేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇ. నరసింహ మాట్లాడుతూ వేముల కత్వ, ఇందిరా సాగర్ ప్రాంతాలను రక్షించేందుకు సీపీఎం పార్టీ ప్రారంభం నుంచే అధికారులకు ఫిర్యాదులు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ భూములు కూడా ఈ వివాదంలో ఉన్నాయని, పూర్తిస్థాయి సర్వే నిర్వహించి అక్రమ కబ్జాలను వెలికితీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, మండల కార్యదర్శి హరిసింగ్, బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణు, సీపీఎం నాయకులు గుండె శివ, వర్కల ముత్యాలు, కావాలి జంగయ్య, బీఆర్ఎస్ నాయకులు కావాలి రాములు, అశోక్, రవి, కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి, అలాగే గ్రామపంచాయతీ వార్డు సభ్యులు రాంరెడ్డి, యాదిరెడ్డి, ఎరుకలి బాలకృష్ణ, కావాలి వెంకటేష్, స్వప్న, భరత్, బీజేపీ నాయకులు రమేష్, కుమార్ పాల్గొన్నారు.



# విగ్రహాలు పెట్టారు మార్చారు

- మూసుకులో అంబేద్కర్ జ్యోతిరావు పూలే విగ్రహాలు
- దాదాపు రెండు సంవత్సరాల నుంచి అదే ముసుగులో విగ్రహాలు

**జిల్లేడు చౌదరిగూడ (జనం సాక్షి) :** మండల కేంద్రంలో అంబేద్కర్ జ్యోతిరావు పూలే విగ్రహాలు పెట్టి మర్చిపోయారు దాదాపుగా రెండు సంవత్సరాల నుంచి విగ్రహాలకు ముసుకు కట్టే ఉంచారు ఏప్రిల్ 14 నా అంబేద్కర్ జయంతి జరుపుకోవడం జరుగుతుంది ఆరోజున ప్రభుత్వ కార్యాలయాలకు పాఠశాలలకు బ్యాంకులకు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిస్తుంది ఇంకా ఈ విగ్రహాలు ముసుగులోనే ఉండడం చాలా ఆశ్చర్యానికి గురించేస్తుందని స్థానికులు వాపోతున్నారు. అంబేద్కర్ విగ్ర హాలను ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణాలు. వివక్షను అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ ఆయన చేసిన పోరాటాన్ని సమానత్వ భావజాలని ప్రజలోకి తీసుకెళ్లడానికి రాజ్యాంగ నిర్మాతగా ఆయన అందించిన హక్కులు, స్వేచ్ఛ ప్రజాస్వామ్యం, విలువలను గుర్తు చేయడానికి పెట్టడం జరుగుతుంది. ఇంతటి మహోనంత వ్యక్తి విగ్రహం ఇంకా ముస్కులోనే ఉంది ఎందుకో స్థానికులకు ప్రశ్నార్థకంగా మారింది.




# ప్రజలు అందించే వినతులను తక్షణమే పరిష్కరించండి

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 21 (జనం సాక్షి):** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందించే వినతులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 67 ఫిర్యాదులు అందాయని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 29, ఇతర శాఖలకు 38, మొత్తం 67 దరఖాస్తులు అందాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి కొరత రాకుండా చూడాలని, గురుకులాల్లో, హాస్టళ్లలో అర్హత కలిగిన బాలికలందరికీ హెచ్‌పీవీ టీకా ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం తేదీ 13-04-2026 నుండి 18-04-2026 వరకు జరిగే "అరైవ్ - అలైవ్" రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మూసీ సుందరీకరణలో రైతులకు నష్టం జరగకూడదు

- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి
- హైదర్గూడాలో మూసీ బాధిత రైతుల ఆందోళన తీవ్రం

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13 (జనంసాక్షి) :** మూసీ సుందరీకరణ పేరుతో భూముల స్వాధీనం చర్యలను వ్యతిరేకిస్తూ హైదర్గూడాలో సోమవారం వృద్ధ రైతులు న్యాయం కోసం పోరాటం ఆందోళన చేపట్టారు. తాతల కాలం నుంచి సాగు చేస్తున్న సుమారు 35 ఎకరాల భూమిని తీసుకుంటే తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పట్లలో కార్తీక్ రెడ్డి హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో ప్రజల జీవితాలతో ఆటలాడకూడదని, భూములు తీసుకోవాలంటే కేంద్ర ప్రభుత్వ చట్టం ప్రకారం సరైన పరిహారం ఇచ్చి, రైతులను భాగస్వాములుగా చేయాలని సూచించారు. కేంద్ర చట్టాల ప్రకారం భూమి విలువకు ఐదు రెట్లు పరిహారం, 80% ప్రజల సమ్మతి అవసరమని గుర్తుచేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన పర్మిషన్ లే నేడు కూల్చివేసి భూములు ఆక్రమిస్తననడం సబబు కాదని గత మధు పార్క్ అపార్ట్మెంట్ విషయంలో ముఖ్యమంత్రితో చర్చించాను అన్నారు ఈ భూముల పై కూడా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పేరుతో పేదల భూములను స్వాధీనం చేసుకోవడమే

ముఖ్యమంత్రి పరిపాలన అని విమర్శించారు. ప్రజలకు అవసరంలేని ప్రాజెక్టుకు వేల కోట్ల రూపాయలు అవసరమని, ప్రభుత్వానికి జీతాలు చెల్లించడానికే నిధులు లేవని అన్నారు. నినైట్ ఎకానమీ" ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి లాభం ఏమిటో వివరించాలని డిమాండ్ చేశారు. భూములను నిప్రొహిబిటెడ్ జోన్"లో పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ, రైతుల భవిష్యత్తును దెబ్బతీయొద్దని హెచ్చరించారు. బదులుగా బుద్వేల్ ప్రాంతంలో ప్రత్యామ్నాయ భూములు ఇస్తే రైతులను ఒప్పిస్తామని తెలిపారు. బీజేపీ నేత తోకల శ్రీనివాస్ రెడ్డి కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, భూములు స్వాధీనం చేసుకుంటే సమీప ప్రాంతాల్లో భూమి ఇవ్వాలని లేదా ఓఆర్ఆర్ మార్కెట్ రేటుకు సరైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజన్ కుమార్ యాదవ్, నారగూడ మల్లారెడ్డి, కొమురయ్య లక్ష్మీనారాయణ, సుభాష్ రెడ్డి, పసుపుల సందీప్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ సంగీత, సుల్గే వెంకటేష్, సాబాద విజయ్ కుమార్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలు సృష్టించి కోట్ల భూమికి ఎసరు

- కోటి రూపాయల ప్లాటును నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయాలని ప్రయత్నం
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అప్రమత్తతతో ముఠా పట్టుబడింది



**చేవెళ్ల, ఏప్రిల్ 13 (జనం సాక్షి):** కోటి రూపాయల విలువైన ప్లాటును నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయాలని ప్రయత్నించిన ముఠాను చేవెళ్ల పోలీసులు అరెస్టు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి మోసాన్ని గుర్తించి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన సోమవారం చేవెళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన శర్మ అనే వ్యక్తి 2006లో భరద్వాజ్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయించాడు. అప్పట్లో బంజారా హిల్స్‌కు చెందిన అనిల్ దుబే తన భార్య అమృత పురకాయస్థ పేరుతో ప్లాట్ నం.235 (మూడు గుంటల ప్లాట్) కొనుగోలు చేశారు. ఇదే ప్లాట్‌పై నగరానికి చెందిన తయ్యబ్ ఉద్దీన్ (తాహెబ్ మహమ్మద్) నకిలీ పత్రాలు సృష్టించి ఈ నెల 10న ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేశాడు. మొదట శుక్రవారం రిజిస్ట్రేషన్ వచ్చినప్పటికీ సమయం దాటిపోవడంతో స్లాట్‌ను 13వ తేదీకి మార్చి సోమవారం ఉదయం మళ్లీ కార్యాలయానికి వచ్చారు. సాయంత్రం పరిశీలిస్తున్న సబ్ రిజిస్ట్రార్ అమృత పేరును పిలవగా అక్కడున్న మున్నాభాయ్ మహిళ ముందుకు వచ్చింది. ఆమెను వివరాలు అడగగా ఆమె తడబడటం సబ్ రిజిస్ట్రార్‌కు అనుమానం కలిగించింది. ఆమె నుంచి సరైన సమాధానం రాకపోవడంతో అధికారులు పత్రాలను సవినయంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో కూడా ధృవీకరించారు. ఈ సమయంలో ముఠాలో ఉన్న తయ్యబ్ ఉద్దీన్ పరిస్థితిని గమనించి పారిపోవడానికి ప్రయత్నించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రెండు అంతస్తు నుంచి దూకడంతో గాయపడ్డాడు. సిబ్బంది వెంటనే స్పందించి అతన్ని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

అతనితోపాటు మున్నాభాయ్, ఆమె కుమార్తె సరస్వతి, అల్లుడు రాజేందర్, మరొక మహిళ సురేఖను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మున్నాభాయ్ తను అమృత కాదని నకిలీగా వచ్చానని ఒప్పుకుంది. సీనియర్ అసిస్టెంట్ దొడ్డి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు గతంలో ఇలాంటి మోసాలకు పాల్పడి ఉండవచ్చని అనుమానిస్తూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అప్రమత్తత వల్ల ముఠా పట్టుబడిన ఈ ఘటన చేవెళ్లలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No: APTEL/2013/50370